డీలిమిటేషన్‌పై జమ్మూకాశ్మీర్ చెప్తున్న పాఠాలు

- జనాభాతో సంబంధం లేకుండానే ఇక్కడ 'పునర్విభజన'
- హిందూ-మెజారిటీ జమ్మూకు లాభం
- ముస్లిం-మెజారిటీ కాశ్మీర్‌కు కోత

5

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupati, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 224 | విజయవాడ, సోమవారం 17 మార్చి 2025 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 17 March 2025 | Rs

ఎఆర్ రెహ్మాన్‌కు అస్వస్థత

- ఆసుపత్రికి తరలింపు...అంతలోనే డిశ్చార్జి



చెన్నై : ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఎ.ఆర్.రెహ్మాన్ అస్వస్థతకు గురికావడంతో ఆదివారం నాడిక్కడ ఓ ఆసుపత్రిలో చేరారు. ఆ తరువాత కొన్ని గంటల్లోనే డిశ్చార్జి అయ్యారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యంగానే ఉన్నారని ఆయన సోదరి రిహానా తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున అస్వస్థత కారణంగా రెహ్మాన్‌ను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. ఇటీవల సుదీర్ఘ ప్రయాణం చేయడం వల్ల రెహ్మాన్ వెన్ను నొప్పి, డీహైడ్రేషన్‌కు గురయ్యారని, ప్రస్తుతానికి ఆరోగ్యం కుదుటపడిందని ఆయనకు వైద్యం అందించిన డాక్టర్ల బృందం తెలిపింది. రెహమాన్ క్షేమంగా ఉన్నారని వైద్యులు సంతోషకరమైన వార్త చెప్పారని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు.

రాష్ట్రం నెత్తిన భస్మాసుర హస్తం


అనకాపల్లిలో అణు కుంపట్లు రాజేస్తున్న కేంద్రం

అమెరికన్ కార్పొరేట్ కంపెనీలకు పణంగా దేశ భద్రత

ఫుకుషిమా పునరావృతమైతే తీరప్రాంతం మొత్తం వల్లకాడే

మేధావులు, అణు శాస్త్రవేత్తల ఆందోళన

గాలి, సౌర విద్యుత్ ప్రత్యామ్నాయాలున్నా.. ప్రజల జీవితాలతో డబుల్ ఇంజిన్ సర్కార్ చెలగాటం



ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అమెరికా మెప్పు కోసం, విదేశీ కార్పొరేట్ కంపెనీల లాభాల కోసం భారతావని భద్రతకు ఆయుపట్టు లాంటి తీరప్రాంతం మొత్తాన్ని డబుల్ ఇంజిన్ సర్కార్ పణంగా పెడుతోంది. థర్మల్ విద్యుత్ కేంద్రాలు, ఫార్మా, రసాయన కంపెనీలతో ఇప్పటికే చిగురుటాకులా వణుకుతున్న ఉత్తరాంధ్ర నెత్తిన అణు విద్యుత్ కేంద్రాల రూపంలో భస్మాసుర హస్తాన్ని పెట్టేందుకు ఎగేసుకొస్తోంది. అనకాపల్లి జిల్లాలో 2,800 మెగావాట్ల సామర్థ్యంతో అణు విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి కనీసం రెండు వేల ఎకరాల భూమిని సేకరించి ఇవ్వాలని రాష్ట్ర మిగతా 5లో

అనకాపల్లి జిల్లాలో..న్యూక్లియర్ పవర్ ప్రాజెక్టును అనుమతించొద్దు
సిఎంకు రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇఎఎస్ శర్మ లేఖ 5

నేటి నుంచి 'పది' పరీక్షలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 6,49,884 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో బాలురు 3,36,225 మంది, బాలికలు 3,13,659 మంది ఉన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 8:45 గంటల నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఈ నెల 31న రంజాన్ అయితే ఏప్రిల్ 1న సోషల్ స్టడీస్ పరీక్ష నిర్వహిస్తామని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 3,450 పరీక్ష కేంద్రాలను, 156 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. 163 సమస్యాత్మక కేంద్రాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమల్లో ఉంటుంది. ప్రభుత్వ పరీక్షల విభాగం కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఫిర్యాదులేమైనా ఉంటే 0866-2974540 నెంబర్‌కు గానీ, dir-govexams@yahoo.com మెయిల్ ద్వారా గానీ చెప్పొచ్చు. ఏప్రిల్ 3 నుంచి 9వ తేదీ వరకు పేపర్ మూల్యాంకనం 26 జిల్లా కేంద్రాల్లో జరగనుంది.

విద్యార్థులకు సిఎం, మంత్రుల శుభాకాంక్షలు

పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. విద్యా ప్రయాణంలో ఈ పరీక్షలు మైలురాయి అని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత కూడా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఎటువంటి ఒత్తిడికి గురికావొద్దన్నారు.

ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం : మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి

పదో తరగతి విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించినట్లు రవాణా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులు వారి హాల్ టిక్కెట్‌ను చూపించి ఆర్‌టిసి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించొచ్చని పేర్కొన్నారు.



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద సిఎం చంద్రబాబు, తదితరుల నివాళి

అమరావతిలో పొట్టి శ్రీరాములు విగ్రహం

- 58 అడుగులతో ఏర్పాటు చేస్తాం
- మ్యూజియంగా నివాసం
- జయంతి సందర్భంగా సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం 58 రోజులపాటు కఠోర దీక్షతో ఆత్మ బలిదానం చేసిన పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని 58 అడుగుల ఎత్తుతో రాజధాని అమరావతిలో ఏర్పాటు చేస్తామని సిఎం చంద్రబాబు ప్రకటించారు. వచ్చే జయంతి నాటికి ఈ విగ్రహ నిర్మాణం పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. అమరావతిలోనే మెమోరియల్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఉండవల్లి నివాసంలో ఆదివారం నిర్వహించిన పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమంలో సిఎం పాల్గొని శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. శ్రీరాములు స్వగ్రామమైన పడమటిపల్లిలోని ఆయన నివాసాన్ని మ్యూజియంగా రూపుదిద్దుతామని, గ్రామంలో ఆధునిక వసతులతో ఆరోగ్య కేంద్రం, హైస్కూల్ నిర్మిస్తామని తెలిపారు. గ్రామస్తుల విన్నపం మేరకు బకింగ్ హమ్ కాలువపై బ్రిడ్జిని నిర్మిస్తామన్నారు. పొట్టి శ్రీరాములు త్యాగంతో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధిలో 2047 నాటికి నెంబర్ వన్‌గా చేయాలన్నారు. ఆయన పేరుతో మెమోరియల్ ట్రస్ట్ ఏర్పాటు చేయాలన్నారు. ఆయన అభిమానులు, సమాజం ముందుకొచ్చి త్యాగాలను గుర్తుచేసేలా ట్రస్ట్ ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా వచ్చే ఏడాది మార్చి 16 వరకూ ప్రతినెలా ఒక్కోటి చొప్పున 12 కార్యక్రమాలు చేపడతామన్నారు. సమాజ హితం కోసం అందరూ పని చేయాలని, పొట్టి శ్రీరాములు స్ఫూర్తిని మనం ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

హడ్కో, సిఆర్‌డిఎ మధ్య ఒప్పందం

హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (హడ్కో), సిఆర్‌డిఎ మధ్య సిఎం చంద్రబాబు సమక్షంలో ఆదివారం ఒప్పందం జరిగింది. ఉండవల్లిలోని సిఎం నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో హడ్కో సిఎమ్‌డి సంజయ్ కుల్ శ్రేష్ఠ, మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ, సిఆర్‌డిఎ, పురపాలక శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ ఒప్పందం మేరకు రాజధాని నిర్మాణాలకు హడ్కో రూ.11 వేల కోట్లు రుణంగా అందించనుంది. జనవరి 22న ముంబైలో జరిగిన హడ్కో బోర్డు సమావేశంలో నిధుల మంజూరుకు అంగీకారం తెలిపారు. ఈ మేరకు సిఆర్‌డిఎతో ఒప్పందం చేసుకున్నారు.



దాడుల్లో ధ్వంసమైన భవనాల వద్ద బాధితులు

యెమెన్‌పై అమెరికా భీకర దాడులు

- 31 మంది మృతి : 100 మందికి పైగా గాయాలు
- హౌతీలను అంతమొందిస్తాం: ట్రంప్
- ప్రతీకార దాడులు తప్పవన్న రెబల్స్

సన్నా (ఎమన్) : అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి అధికార పగ్గాలు చేపట్టిన డోనాల్డ్ ట్రంప్ యుద్ధోన్మాదానికి యెమెన్ మరోసారి బలవుతోంది. ట్రంప్ ఆదేశాల మేరకు అమెరికా సైన్యం ఆదివారం ఆ గల్ఫ్ దేశంపై భీకర దాడులకు దిగింది. ఈ దాడుల్లో 31 మంది చనిపోయారు. ఇంకా అనేక మంది గాయపడ్డారు. మృతుల్లో ఎక్కువ మంది మహిళలు, పిల్లలే ఉన్నారు. ఇరాన్‌కు మద్దతు ఇస్తున్న హౌతీ తిరుగుబాటుదారులను అంతమొందించడమే లక్ష్యమని ట్రంప్ హూంకరించారు. బైడెన్ ప్రభుత్వ హయాంలోను యమెన్‌పై దాడులు సాగాయి. ట్రంప్ వచ్చాక వీటిని మరింత తీవ్రతరం చేశాడు. అమెరికా, దాని మిత్రపక్షాలు, గల్ఫ్‌లోని తన తాబేదారులతో కలసి యెమన్‌పై దీర్ఘకాలికంగా విధ్వంసకర దాడులు చేస్తూ, ఆ దేశాన్ని మిగతా 2లో

ఇద్దరు రైతుల ఆత్మహత్య

ప్రజాశక్తి - యంత్రాంగం

అప్పులతో వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు రైతులు ఆదివారం బలవన్మరణానికి పాల్పడ్డారు. పోలీసులు, మృతుల కుటుంబ సభ్యుల కథనం ప్రకారం. నంద్యాల జిల్లా రుద్రవరం మండలం కోటకొండకు చెందిన సుబ్బయ్య (40) తనకున్న రెండెకరాలతోపాటు మూడున్నర ఎకరాలను కౌలుకు తీసుకొని వరి, మినుము సాగు చేశారు. దిగుబడి ఆశించినంతగా రాకపోవడంతో రూ.5 లక్షల వరకూ అప్పులపాలయ్యాడు. అప్పు ఇచ్చినవారు ఒత్తిడి చేయడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య వరలక్ష్మి, ఇద్దరు కుమారులున్నారు.

గుంటూరు జిల్లా తాడికొండ మండలం బడేపురానికి చెందిన సంకురు హృదయరాజు (60) నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేస్తున్నారు. సాగు నిమిత్తం రూ.లక్షల్లో అప్పు చేశారు. అధిక వర్షాలు, తెగులు కారణంగా పంట దిగుబడి తగ్గి నష్టాలు రావడం, అప్పులవారి ఒత్తిడి పెరగడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. శనివారం ఉదయం తన ఇంట్లోనే గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆయనను గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం రాత్రి మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రైవేటుకు ఆర్‌టిసి బస్ స్టేషన్లు

- 3 విడతలుగా నాలుగేళ్లలో ప్రక్రియ పూర్తి
- వడోదర మోడల్ బస్ స్టేషన్లు అమలు దిశగా అడుగులు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అత్యధిక ఆదాయం వచ్చే రూట్లలోని బస్ స్టేషన్లను పెట్టుబడిదారులకు అప్పజెప్పేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు తయారు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం గుజరాత్‌లోని వడోదర మోడల్ బస్ స్టేషన్ (ఇంటిగ్రేటెడ్) తరహాలో ఈ ప్రాజెక్టును రాష్ట్రంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ప్రాజెక్టును నాలుగేళ్లలో పూర్తి చేయాలని కేంద్రప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి సూచించినట్లు తెలిసింది. మూడు విడతలుగా నాలుగేళ్లుగా ఈ ప్రాజెక్టును అమలు చేసే విధంగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు సమా చారం. ఇటీవల ఆర్‌టిసి అధికారులను గుజరాత్‌లోని వడోదర ప్రాజెక్టును పరిశీలనకు కూడా పంపింది. ఈ బస్ స్టేషన్లలోకి ఆర్‌టిసితోపాటు ప్రైవేటు బస్సులు కూడా కొంతమేర కన్సార్టియం లేక కాంట్రాక్టరుకు చెల్లించాల్సి ఉంటుంది. బస్ స్టేషన్లను ప్రైవేటీకరణ చేసేందుకు ఇప్పటికే ఆర్‌టిసి అధికారులు ఒక విధాన పత్రాన్ని సిద్ధం చేసి ప్రభుత్వ ఆమోదం కోసం ఎదురు చూస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రభుత్వ ఆమోదం లభించిన వెంటనే ఆర్‌టిసి అధికార యంత్రాంగం కార్యాచరణ దిశగా అడుగులు వేసే అవకాశమున్నట్లు ఆర్‌టిసి వర్గాల్లో అంతర్గతంగా చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఆర్‌టిసి బస్ స్టేషన్లను అభివృద్ధి పేరుతో అనేకమంది పారిశ్రామిక వేత్తలు, కార్పొరేట్లు వారి ప్రతినిధి బృందాలు సందర్శిస్తున్నాయి.

స్థలాలను సైతం

బస్ స్టేషన్ ఆవరణలోని విలువైన ఖాళీ స్థలాలను సైతం కార్పొరేట్లకు అమ్మేందుకు అడుగులు వేస్తున్నట్లు సమాచారం. అవసరమైతే 15, 20 ఏళ్లపాటు ఆయా స్థలాలను లీజు పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఆర్‌టిసికి రాష్ట్ర వ్యాప్తంగా 1,979.03 ఎకరాల భూమి ఉంది. ఆర్‌టిసిలో 46,523 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, ఇందులో 129 బస్ డిపోలు, 423 బస్ స్టేషన్లు ఉన్నాయి. నిత్యం ఆర్‌టిసి ద్వారా 44 లక్షల మంది ప్రయాణికులు మిగతా 2లో

అయిదు రోజుల పర్యటనకు న్యూజిలాండ్ ప్రధాని రాక

- నేడు మోడీతో భేటీ

న్యూఢిల్లీ : భారత్‌లో ఐదు రోజుల పర్యటన నిమిత్తం న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ఆదివారం ఢిల్లీకి చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు కేంద్ర మంత్రి ఎస్‌పి సింగ్ బాఘేల్ స్వాగతం పలికారు. న్యూజిలాండ్ ప్రధాని వెంట ఆ దేశ మంత్రులు, ప్రముఖ వ్యాపారవేత్తలు, కివీస్‌లోని భారతీయ సమాజపు ప్రతినిధి బృందం, పార్లమెంటేరియన్లతో కూడిన భారీ బృందం తరలి వచ్చింది. 2023 నవంబర్‌లో న్యూజిలాండ్ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత క్రిస్టోఫర్ భారత్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం, ఆర్థిక సంబంధాలను మరింతగా బలోపేతం గావించడమే ఈ పర్యటన ఉద్దేశమని క్రిస్టోఫర్ తెలిపారు. సోమవారం ప్రధాని నరేంద్ర మోడీతో విస్తృత స్థాయి చర్చల్లో ఆయన పాల్గొననున్నారు. అలాగే రైసీనా డైలాగ్ ప్రారంభ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఆదివారం కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్‌తో క్రిస్టోఫర్ సమావేశమయ్యారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ)పై చర్చలు ప్రారంభించారు.

రొయ్య రైతుల బేజారు

- ధర పతనంతో నష్టాలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

గత నెలలో ఆశాజనకంగా ఉన్న రొయ్యల ధరలు ప్రస్తుతం ఒక్కసారిగా పతనమయ్యాయి. ఎగుమతులు లేవనే పేరుతో వ్యాపారులు సిండికేటై ధరలను తగ్గించేశారని రైతులు వాపోతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 20.614 మంది రైతులు సుమారు 75 వేల ఎకరాల్లో రొయ్యలను సాగు చేస్తున్నారు. అత్యధికంగా కోనసీమ జిల్లాలో 50 శాతం, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలో మిగిలిన 50 శాతం రొయ్యలు సాగవుతున్నాయి. గత నెలలో వంద కౌంట్‌కు రూ.255 ధర వచ్చింది. ప్రస్తుతం రూ.రూ.220 మించడంలేదు. 90 కౌంట్‌కు గత నెలలో రూ.265కి ధర లభించింది. ప్రస్తుతం రూ.235 మాత్రమే వస్తోంది. 80 కౌంట్ ధర గత నెలలో రూ.285 ఉంది. ప్రస్తుతం రూ.250కు పడిపోయింది. 70 కౌంట్ ధర రూ.325 నుంచి రూ.285, 60 కౌంట్ ధర రూ.345 నుంచి రూ.315కు కొనుగోలుదారులు తగ్గించేశారు. 50 కౌంట్ ధర రూ.375 నుంచి రూ.335కు పతనమైంది. 40 కౌంట్ ధర రూ.415 నుంచి రూ.350కు పడిపోయింది. జిల్లా నుంచి చైనా, యూరప్, కొరియా దేశాలకు రొయ్యలు ఎక్కువగా ఎగుమతులు జరుగుతున్నాయి. ఆక్వా రైతులను గత



కొన్నేళ్లుగా ప్రకృతి వైపరీత్యాలు నష్టాల బాట పట్టించాయి. గత నెలలో ఆశాజనక పరిస్థితులు నెలకొనడంతో ఉత్సాహంగా సాగు ప్రారంభించిన రైతులకు వేసవి సాగు కష్టాలు తప్పవనే సంకేతాలు కనిపిస్తున్నాయి. రొయ్యల మేత ధరలు ఏటా పెరుగుతుండడం, ఆశాజనక ధర లభించకపోవడం వంటి వరుస పరిణామాలు గోరుచుట్టుపై రోకలి పోటులా మారాయి. ఈ నేపథ్యంలో ధరలు నిలకడగా లేకపోతే నష్టాలు తప్పవనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 280 వరకూ హేచరీలు ఉన్నాయి. హేజరీలు అధిక ధరకు నాసిరకం ఫీడ్‌ను అంటగడుస్తున్నాయి. దీన్ని చెరువుల్లో వేసిన పది రోజులకు రొయ్య పిల్లలు విపరీతంగా చనిపోతున్నాయి. వాటిల్లో కొన్ని బతికి బయట పడినా సమాన గ్రోత్ రావడం లేదు. వాటిని అమ్మకుందామంటే రొయ్యల ప్రాసెస్ కంపెనీ వ్యాపారులు సిండికేట్లుగా ఏర్పడి దోచుకుంటున్నారు. మత్స్యశాఖ అధికారులు నెలకు రెండుసార్లు మేచరీలను పరిశీలించి ఆయా యజమానులకు నాణ్యమైన సీడ్ ఉత్పత్తులపై పలు సూచనలు సలహాలు ఇవ్వాలి. కొన్ని నెలలుగా ఇటువంటి కార్యక్రమాలు చేపట్టిన దాఖలాలు లేవు. మరోవైపు రొయ్యలకు వినియోగించే మేత ప్రొ బయాటిక్స్, ఇతర మందుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి.

నెల రోజుల్లో రూ.60 ధర పతనం

రొయ్యల కొనుగోలుదారులు సిండికేట్‌గా ఏర్పడడంతో నెల రోజుల్లో 40 కౌంట్ ధర రూ.60 పతనమైంది. కారణమేంటని అడిగితే ఎగుమతులు జరగడం లేదని జవాబిస్తున్నారు. మరోవైపు రొయ్య పిల్లల ధరలు, ఫీడ్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఎకరా సాగుపై లక్ష వరకూ అదనపు భారం పడింది. ఉన్నతాధికారులు దృష్టి సారించాలి. ధరలు నిలకడగా ఉండేలా, ధర గిట్టుబాటు వచ్చేలా చర్యలు ,తీసుకోవాలి.

-వై.రాజారావు, ఐ.పోలవరం మండలం, వేమవరం గ్రామం



అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న కొత్త వ్యోమగాములకు స్వాగతం పలుకుతున్న సునీత, విల్మోర్

కొత్త వ్యోమగాములకు సునీత, విల్మోర్ స్వాగతం

- త్వరలో భువికి చేరుకోనున్న ఆ ఇద్దరు

వాషింగ్టన్ : అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్‌ఎస్)లో తొమ్మిది మాసాలుగా చిక్కుకుపోయిన వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ అన్నీ అనుకూలిస్తే బుధవారానికల్లా తిరిగి భూమి మీదకు చేరుకుంటారు. వారు తిరిగి రావడానికి అనువుగా, వారిని రిలీవ్ చేసేందుకు నలుగురు వ్యోమగాములను తీసుకు వెళ్లిన స్పేస్ ఎక్స్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంతో అనుసంధానమైంది. ఈ నలుగురు వ్యోమగాములకు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ స్వాగతం పలికారు. ఇందుకు సంబంధించిన వీడియోను నాసా విడుదల చేసింది. కొత్త వ్యోమగాములకు వీరిద్దరూ బాధ్యతలు అప్పగించడానికి రెండు రోజులు పడుతుందని, ఆ తరువాత వాతావరణ అనుకూలతను బట్టి వారి తిరుగు ప్రయాణం ఉంటుందని మిగతా 2లో

180 చీనీ చెట్లు అక్రమంగా నరికివేత

ప్రజాశక్తి - పుట్లూరు (అనంతపురం జిల్లా)

అనంతపురం జిల్లా పుట్లూరు మండల పరిధిలోని గరుగుచింతలపల్లి రైతుకు చెందిన 180 చీనీ చెట్లను అక్రమంగా శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గరుగుచింతలపల్లికి చెందిన టిడిపి నాయకుడు మంజుల నాగరాజు తన ఐదు ఎకరాల పొలంలో 600 చీనీ చెట్లను మూడు సంవత్సరాల క్రితం నాటారు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తోటలోకి చొరబడి 180 చీనీ చెట్లను నరికివేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సిఐ సత్తిబాబు, ఎస్ఐ వెంకటనరసింహ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి సోదాలు చేయించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

ప్రజాశక్తి- సారవకోట (శ్రీకాకుళం జిల్లా)

లారీని కారు ఢీకొన్న ప్రమాదంలో భార్యాభర్తలు మృతి చెందిన సంఘటన శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం కురడిసింగి వద్ద ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతపట్నానికి చెందిన పెద్దగోపు వెంకటప్రసాద్ (56), భార్య వాణి (45) తమ కుమారుడితో కలిసి శ్రీకాకుళంలో ఓ వివాహ వేడుకకు హాజరయ్యారు. అనంతరం కారులో పాతపట్నం తిరుగు ప్రయాణమయ్యారు. వారు ప్రయాణిస్తున్న కారు సారవకోట మండలం కురడిసింగి వద్ద ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. వారి కుమారుడితోపాటు లారీ డ్రైవర్, క్లీనర్ గాయపడ్డారు. ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు అయ్యింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుక్కెడు నీటి కోసం అవస్థలు

- తాగునీటి సమస్యను పరిష్కరించాలి
- ప్రజా చైతన్య యాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు



ప్రజా చైతన్య యాత్రలో సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-యంత్రాంగం

ఒకవైపు దేశ ప్రధాని నరేంద్ర మోడీ జలజీవన్ మిషన్ పేరుతో ఉచితంగా మంచినీరు సరఫరా చేస్తామని ప్రకటనలు చేస్తున్నారని, మరోవైపు నెల్లూరు నగరంలో గుక్కెడు తాగునీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు తెలిపారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో సాగుతున్న ప్రజా చైతన్య యాత్ర ఆదివారం 54వ డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్ కాలనీలో సాగింది. ఈ యాత్రలో ముఖ్య అతిథిగా వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. భగత్ సింగ్ కాలనీలోని పలు వీధుల్లో ప్రజల వద్దకెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మాట్లాడుతూ.. కొళాయిల్లో మురుగు నీరు వస్తోందని, వాడుకోవడానికి ఇబ్బందిగా ఉందని తెలిపారు. పెన్నా నదిలో రివిట్‌మెంట్ గోడ కడుతుండడంతో భగత్‌సింగ్ కాలనీలోని డ్రెయినేజీ నీరు బయటకు వెళ్లేందుకు దారి లేకుండా కాంట్రాక్టర్ అడ్డుగా కట్ట వేయడంతో ఒకేచోట మురుగునీరు చేరి దుర్గంధం వెదజల్లుతోందన్నారు. దానిపై స్పందించిన వి శ్రీనివాసరావు ప్రజల సమక్షంలో ఇరిగేషన్ అధికారులకు ఫోన్ చేసి సమస్య తీవ్రతను వివరించారు. 24 గంటల్లో సమస్యకు పరిష్కారం చూపకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి మురుగునీరు వెళ్లకుండా అడ్డుకట్టగా వేసిన కట్టను తెగ్గొడతామని అధికారులు హెచ్చరించారు. నోటీసు ఇవ్వకుండా దౌర్జన్యంగా తొలగించిన ఇళ్లకు సంబంధించి బాధితులంతా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలని సూచించారు. నెల్లూరు నగరంలో కొళాయి పన్నులకు సంబంధించి నోటీసులు ఇచ్చి ప్రజలను వేధింపులకు గురిచేయడం సరికాదన్నారు. మౌలిక సదుపాయాల్లేక నగరంలో ప్రజలు అల్లాడుతుంటే, వాటిని వదిలేసి 166 ప్రత్యేక టీములను పన్నుల వసూలు కోసం ఏర్పాటు చేసి నెల్లూరు నగర ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ నెల 22 నుంచి సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన, పోరాట కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల జిల్లా పంగులూరు మండలంలోని చందలూరు కాలనీలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి ఎదుట రైతులు, కౌలు రైతులు తమ సమస్యలను ఏకరవు పెట్టారు. నల్ల బర్లీ పొగాకు సాగు చేయాలని చెప్పిన కంపెనీలు ఇప్పుడు ముఖం చాటేస్తున్నాయని రైతులు తెలిపారు. వడ్డీలకు అప్పులు తీసుకొచ్చి సాగు చేశామని, పొగాకు కొనకపోతే ఏమి చేయాలో అర్థంకాక సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు గుర్తింపు కార్డు ఇవ్వడంలేదని కౌలు రైతులు తెలిపారు. కర్నూలులోని జొహరాపురం వాసులు మాట్లాడుతూ.. డ్రెయినేజీ, శిథిలమైన సిసి రోడ్లు, కరెంట్ ఛార్జీలతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. నంద్యాల పట్టణంలోని బయటిపేట, తెలుగుపేట ప్రాంత వాసులు మాట్లాడుతూ మురికి కాల్వల్లో చెత్తను తీయడంలేదని, దోమలు పెరిగిపోతుయని, తాగు నీటిని మూడు రోజులకు ఒకసారి వదులుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో మద్దిలేరు వాగు పొంగి తమ ఇళ్లలోకి వరద నీరు వస్తోందన తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని గోగాడవలస జంక్షన్ నుంచి కన్నయ్యవలస జంక్షన్ వరకు గల రహదారి పూర్తిగా పాడైపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. చిట్టిపురం, తుమ్మరావుపల్లి ప్రాంతాల్లో జమీందారుల పేరుతో ఉన్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని, తోకమెట్ట జంక్షన్ నుంచి ఒడిసెలమడకు రహదారి నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలోని గవరపాలెం, కె.కోటపాడు మండలంలోని వారాడ, ఆర్‌వై.అగ్రహారం, పోతన వలస, సూరెడ్డిపల్లి, రాంబిల్లి మండలంలో ప్రజా చైతన్య యాత్రలు సాగాయి. అధిక విద్యుత్ బిల్లులు, తాగునీరు, ఇతర సమస్యలను స్థానికులు నాయకుల ఎదుట విన్నవించారు. పశ్చిమగోదావరి జిల్లా టి.నరసాపురంలోని అంబేద్కర్ సెంటర్, అల్లూరి సీతారామరాజు నగర్, ప్రకాష్‌నగర్, జంగారెడ్డిగూడెం మండలంలోని ఎ.పోలవరంలో సిపిఎం నేతలు పర్యటించి గ్రామస్తులతో మాట్లాడారు. ఇళ్లు, ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి డిజైన్ మార్చాలి

- రైతులకు భూ నష్టాన్ని తగ్గించాలి
- ముఖ్యమంత్రికి సిపిఎం లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బాబు జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి లిఫ్ట్ కాలువ ద్వారా విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు సాగు, తాగునీరు ఇచ్చేందుకు ఇప్పుడున్న ఆయకట్టు పరిస్థితికి అనుగుణంగా మార్పుచేసి ప్రాజెక్టు వ్యయం, రైతుల భూ నష్టం తగ్గించేలా చూడాలని ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం లేఖ రాశారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రధాన కాలువ ద్వారా విజయనగరం జిల్లాలో 3.94 లక్షల ఎకరాలు, శ్రీకాకుళంలో 84 వేల ఎకరాలు సాగునీటి లక్ష్యంతో ఉందని తెలిపారు. ఇప్పటికే ప్రతిపాదిత ఆయకట్టు సుమారు 45 వేల ఎకరాలు తోటపల్లి ప్రాజెక్టు కుడికాలువలోనూ,

తోటపల్లి గజపతినగరం బ్రాంచి కాలువలో 15 వేల ఎకరాలు, తారకరామ ప్రాజెక్టు 22 వేల ఎకరాలు, తాటిపూడి ప్రాజెక్టు కింద 15 వేల ఎకరాలు, ఆంధ్ర ప్రాజెక్టు కింద 9,500 ఎకరాలు స్థిరీకరణ చేసి ఉందని పేర్కొన్నారు. సుజల స్రవంతి కాలువతో కలిపి ద్వంద్వ ఆయకట్టుగా, అలాగే సుమారు 20 వేల ఎకరాలు రియల్ ఎస్టేట్‌గా మారడం వల్ల ఇప్పుడు అవసరమైన ఆయకట్టుకు అనుగుణంగా ప్రధాన కాలువ డిజైన్ మార్చుకుని రెండు జిల్లాల ఆయకట్టుకు తాగు, సాగునీరు, పరిశ్రమలు, ఇతర అవసరాలకు అందించవచ్చని వివరించారు. ఇప్పుడున్న ప్రధాన కాలువను 1,01,575 మీటర్ల దూరాన్ని తగ్గించుకుని 47 వేల మీటర్ల నుంచి ఎస్.కోట మండలం కొత్తూరు వద్ద నుంచి రేగపుణ్ణగిరి ద్వారా బొడ్డవరం వద్ద గల చిలకలగెడ్డలోకి సుమారు 7 కిలోమీటర్లు ప్రధాన కాలువ గ్రావిటీ ద్వారా మళ్లించి, తాటిపూడి రిజర్వాయర్ ద్వారా తాటిపూడి ఎక్స్‌టెన్షన్ బాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి గ్రావిటీ ద్వారా ప్రతిపాదిత కాలువను బొండపల్లి మండలం గుమడం వద్ద నుంచి తీసుకుపోయి శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలో ఉన్న ప్రతిపాదిత ఆయకట్టుకు నీరు అందించవచ్చని తెలిపారు. ప్రతిపాదిత ప్రధాన కాలువ 40 కిలోమీటర్లు తగ్గి సుమారు 2 వేల ఎకరాల భూసేకరణ తగ్గి, ప్రాజెక్టు ఖర్చు, రైతుల నుంచి రెండు, మూడు పంటలు పండే భూ నష్టం తగ్గించవచ్చని పేర్కొన్నారు. మార్పుచేసిన డిజైన్ వల్ల లిఫ్ట్‌లు తగ్గి గ్రావిటీ మీద నీటి సరఫరా చేయవచ్చని తెలిపారు. రైతులకు డిజైన్ మార్పులకు అవకాశాలు పరిశీలిస్తామని ఎన్నికల ముందు బొండపల్లి బహిరంగ సభలో, గంట్యాడ బహిరంగ సభలో విద్యాశాఖ మంత్రి లోకేష్ హామీ ఇచ్చారని లేఖలో పేర్కొన్నారు. కానీ ఇరిగేషన్ అధికారులు డిజైన్ మార్పులు పరిశీలించకుండా యథావిధిగా భూసేకరణకు పూనుకుంటున్నారని వివరించారు. కావున నిపుణులతో పరిశీలింపజేసి ప్రభుత్వానికి ప్రాజెక్టు భారాన్ని తగ్గించి, ప్రతిపాదిత ఆయకట్టుదారులకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులకు భూ నష్టాన్ని తగ్గించే విధంగా రైతు, రైతు సంఘాలతో చర్చించి సూచనలను పరిగణనలోకి తీసుకొని ప్రత్యామ్నాయం పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజా ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లండి

- సిపిఎం నెల్లూరు రూరల్ మహాసభలో వి శ్రీనివాసరావు



మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు జిల్లా ఉద్యమానికి ప్రత్యేక చరిత్ర ఉందని, నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఎన్నో పోరాటాలు నిర్వహించారని, రానున్న రోజుల్లో ఉద్యమాలను మరింత ముందుకు తీసుకెళ్లి ప్రజలకు చేరువ కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలోని మినీహాలులో సిపిఎం నెల్లూరు రూరల్ 4వ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత పార్టీ పతాకాన్ని సిపిఎం సీనియర్ నాయకులు రమమ్మ ఆవిష్కరించారు. అనంతరం ప్రారంభ సభలో వి శ్రీనివాసరావు మాట్లాడుతూ నెల్లూరు ప్రాంతంలో ఇళ్ల స్థలాల పోరాటాలు, తాగునీరు, కనీస సౌకర్యాలు, స్థానిక సమస్యలపై జరిగిన పోరాటాలను ప్రస్తావిస్తూ, రానున్న కాలంలో వీటిని మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. వైసిపి ప్రభుత్వం పోయి టిడిపి ప్రభుత్వం వచ్చింది తప్ప, పాత విధానాలే కొనసాగుతున్నాయని తెలిపారు. అంతర్జాతీయంగా నేడు కమ్యూనిజం పుంజుకుంటుందన్నారు. ఇది మరింత ఉధృతంగా ముందుకు రానుందని పేర్కొన్నారు. ఇటీవల శ్రీలంకలో జరిగిన ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ గణనీయంగా పుంచుకొని అధికారంలో వచ్చిందని గుర్తు చేశారు. కమ్యూనిజానికి కాలం చెల్లిందని చంద్రబాబు నాయుడు ఒకప్పుడు చెప్పారని, వాస్తవానికి ఇప్పుడు చంద్రబాబు నాయుడు విధానాలకు కాలం చెల్లిందని వివరించారు. మారాల్సింది కమ్యూనిస్టులు కాదని, చంద్రబాబునాయుడని అన్నారు. అవినీతి అంతుచూస్తానని చంద్రబాబు నాయుడు చెప్తున్నారని, విద్యుత్ కొనుగోలు కోసం సెకీతో ఒప్పందం విషయంలో జరిగిన అవినీతిలో అదానిని, జగన్‌ను ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్నించారు. మత విద్వేషాలు పెంచడానికి బిజెపి ప్రయత్నిస్తోందని, మతోన్మోద ప్రమాదం పొంచి ఉందని, కుంభమేళలో ఏం జరిగిందో చూశామని అన్నారు. తామే దేశాన్ని శాసిస్తామని అఘోరాలు చెబుతున్నారని, దీనిని బిజెపి పోత్సహిస్తోందని విమర్శించారు. సనాతన ధర్మం పేరుతో పవన్ కల్యాణ్ నేడు ఊరూరా తిరుగుతున్నారని, ఏడేళ్ల కిందట బిజెపిని తిట్టిన ఆయన ఇప్పుడు ఆ పార్టీని మోస్తున్నారని అన్నారు. భాష పేరుతోనూ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. హిందీని దేశంపై బలవంతంగా రుద్దడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, ఇది సరికాదని, మాతృభాషలోనే చదువు చెప్పాలని అన్నారు. నియోజకవర్గాల డీ లిమిటేషన్‌పై ప్రస్తుతం చర్చ జరుగుతోందని, ఎక్కువ జనాభా ఉన్న రాష్ట్రాల్లో ఎక్కువ సీట్లు వస్తాయని, తక్కువ జనాభా ఉంటే తక్కువ వస్తాయని, దీనివల్ల తక్కువ జనాభా ఉన్న దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయన్నారు. సీట్ల నిష్పత్తి మారకుండా డీలిమిటేషన్ చేయాలని డిమాండ్ చేశారు. డీలిమిటేషన్ విషయంలో మోడీకి చంద్రబాబు, పవన్ కల్యాణ్, జగన్ దాసోహం అవతున్నారని విమర్శించారు. మోడీ కార్పొరేట్ విధానాలు, మతోన్మోద విధానాలు, అప్రజాస్వామిక విధానాలు దేశానికి ప్రమాదకరమని, దీనిని ఓడించడమే రాబోయే రోజుల్లో రాజకీయ కర్తవ్యం కావాలని పిలుపునిచ్చారు. బిజెపిని ఓడించాలంటే వామపక్షాలు, అందులోనూ సిపిఎం బలపడాలన్నారు. స్థానిక సమస్యలపై నిరంతరంగా పోరాటాలు సాగించాలని, ప్రజలను నిత్యం అంటిపెట్టుకొని ఉండాలని సూచించారు. వర్గ పోరాటాలు, ప్రజా పోరాటాలు ఉధృతం చేసి స్థానిక నాయకత్వాన్ని పెంపొందించుకోవాలని, ప్రజలకు ఏ సమస్య వచ్చినా అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. మహాసభకు అధ్యక్షవర్గంగా షాహీనా బేగం, సంపత్, కొండ ప్రసాద్ వ్యవహరించారు. సంతాప తీర్మానాన్ని ఎం.సుధాకర్ ప్రవేశపెట్టారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యదర్శిగా కొండా ప్రసాద్



సిపిఎం నెల్లూరు రూరల్ కార్యదర్శిగా కొండా ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 21 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

సంస్కరణలతో పాఠశాలలు మూత

యుటిఎఫ్ సదస్సులో ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యలో తీసుకొస్తున్న సంస్కరణల వల్ల పాఠశాలలు మూతపడే ప్రమాదం ఉందని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఆందోళన వ్యక్తం చేశారు. 'విద్యారంగ-ఆర్థిక సమస్యల సాధనకై ఉద్యమిద్దాం' అనే అంశంపై యుటిఎఫ్ ఆధ్వర్యాన సదస్సు జరిగింది. విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆ సంఘం ఆడిట్ కన్వీనర్ టిఎస్ మల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జిఓ 117 వల్ల పాఠశాల విద్య సంక్షోభం ఎదుర్కొంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ జిఓకు వ్యతిరేకంగా పిడిఎఫ్, యుటిఎఫ్ ఉమ్మడిగా పోరాటం చేశామని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఉండగా ఈ జిఓను రద్దు చేస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారని తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు ఈ జిఓను అధికారికంగా రద్దు చేయలేదని పేర్కొన్నారు. దీనివల్ల బాలికలు ఎక్కువగా డ్రాపవుట్ అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి రావాల్సిన ఆదాయంపై ఒత్తిడి చేయవలసిందిపోయి ఉద్యోగుల జీతాలపై రాష్ట్రప్రభుత్వం దుష్ప్రచారం చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రాలకు తన నుంచి వచ్చే వాటాను కేంద్ర ప్రభుత్వం తగ్గిస్తోందన్నారు. గతంలో రాష్ట్రాలకు 42 శాతంగా ఉన్న పన్నుల వాటా ఇప్పుడు 32 శాతానికి తగ్గిందన్నారు. కేంద్రం తీసుకొచ్చిన జిఎస్‌టి వల్ల సుమారు రూ.30 వేలకోట్లు రాష్ట్రానికి నష్టం వచ్చిందన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాల్లో కూడా కోతలు విధించిందన్నారు. సమగ్రశిక్షలో 75:25 శాతంగా ఉన్న కేంద్రం, రాష్ట్రం వాటాను 60:40 శాతంగా తీసుకొచ్చిందన్నారు. రాష్ట్రాల హక్కుల కోసం మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు తీవ్ర పోరాటం చేశారని గుర్తు చేశారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులను అడిగే దమ్ము ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేదన్నారు. ఉద్యోగులకు ఒపిఎస్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. ఉద్యోగుల బకాయిలు చెల్లింపుపై తక్షణమే రూట్‌మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలైనా ఉద్యోగులకు 12వ పిఆర్‌సి కమిషన్ నియమించలేదన్నారు. ఉద్యోగులకు ఉన్న రూ.30వేల కోట్ల బకాయిలు కూడా చెల్లించడం లేదన్నారు. 2004 సెప్టెంబర్ 1వ తేదీ ముందు ఉద్యోగంలో చేరిన వారికి వెంటనే పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ఆర్థిక సమస్యలు, బకాయిలపై ప్రభుత్వం స్పందించకపోతే పోరుబాట పడతామని హెచ్చరించారు. యుటిఎఫ్ అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విద్యా రంగంలో ప్రపంచ బ్యాంకు సంస్కరణలే అమలవుతున్నాయని తెలిపారు. ఈ సంస్కరణల వేగాన్ని తగ్గించి పాఠశాలలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని, లేదంటే పోరాటానికి సన్నద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ సహాధ్యక్షులు ఎఎన్ కుసుమకుమారి, బి లక్ష్మీరాజా, బి సుభాషిని, వి శ్రీలక్ష్మి, ఎ ఉమామహేశ్వరరావు, ప్రచురణల విభాగం ఛైర్మన్ ఎం హనుమంతరావు, జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి కె రామారావు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన జీతాలు అమలు చేయాలి

- యుపిహెచ్‌సిఇయు డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యుపిహెచ్‌సి) ఉద్యోగులకు గత ప్రభుత్వం జీతాలు పెంచుతూ ఉత్తర్వులిచ్చి అమలు చేయకుండా తీవ్ర అన్యాయం చేసిందని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు పేర్కొన్నారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఎంప్లాయీస్ యూనియన్ (యుపిహెచ్‌సిఇయు) రాష్ట్ర సర్వసభ్య సమావేశం ప్రధాన కార్యదర్శి జె సింహాచలం అధ్యక్షతన విజయవాడలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ... వైద్యారోగ్యశాఖ కమిషనర్ అప్పుడు జరిగిన జెఎసి చర్చల్లో అంగీకరించిన హామీలను నేటికీ నెరవేర్చకుండా తాత్సారం చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో కన్వీనింగ్ కమిటీ కన్వీనర్‌గా టి రాజారత్న రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే యుపిహెచ్‌సి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని, లేకుంటే ఉద్యోగులంతా ఉద్యమానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. జూన్ 22న నిర్వహించనున్న యుపిహెచ్‌సి ఉద్యోగుల రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆయుష్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం వీరే...

ఆయుష్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని విజయవాడ, సిఐటియు కార్యాలయంలో ఆదివారం జరిగిన రాష్ట్ర సమావేశంలో ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఎవి నాగేశ్వరరావు, అధ్యక్షులుగా రామానంద్, ఉపాధ్యక్షులుగా రషీద్, ఎ శ్రీనివాసరావు, సంపత్, జనరల్ సెక్రటరీగా టి అంజలీదేవి, సెక్రటరీగా సునీత, భాను బేగం, రమేష్, ట్రెజరర్‌గా ఎమ్‌డి షఫీ, మరో పది మంది కార్యవర్గ సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎపి ఎన్‌హెచ్‌ఎం జెఎసి హానరరీ ఛైర్మన్ ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం), ఆయుష్ ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ, పిఎఫ్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎపి ఎన్‌హెచ్‌ఎం జెఎసి ఛైర్మన్ దయామని మాట్లాడుతూ.. జిఓ 2ను సవరించి ఆయుష్, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు ఎంటిఎస్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయుష్ డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బంది 15 ఏళ్లుగా పని చేస్తున్నా ఉద్యోగ భద్రత లేదన్నారు. పనికి తగిన వేతనం చెల్లించడం లేదని తెలిపారు.

యెమెన్‌పై అమెరికా భీకర దాడులు

(మొదటి పేజీ తరువాయి)

సర్వనాశనం చేస్తున్నాయి. ఈ దాడులు, ఘర్షణల వల్ల యెమెన్‌లో 33 లక్షల మంది ఇప్పటికే ఆకలి రక్కసి కోరల్లో చిక్కుకున్నారు. అక్కడ ప్రజాస్వామ్య బద్ధమైన ప్రభుత్వం ఏదీ లేకుండా చేసి అగ్రరాజ్యం అరాచకం సృష్టిస్తోంది. వివిధ గ్రూపుల మధ్య ఆధిపత్య పోరులో అమెరికా పాత్ర ఉంది. అమెరికా జోక్యానికి వ్యతిరేకంగా పోరాడుతున్న ఇరాన్ అనుకూల గ్రూపు హౌతీలు దేశ రాజధాని సనాతో సహా కీలక పట్టణాలపై పట్టు సాధించారు. ఈ నేపథ్యంలోనే హౌతీలపై ట్రంప్ దాడులు, హూంకరింపులను చూడాలి. ట్రంప్ చర్యలకు ప్రతీకారంగా కీలకమైన ఎర్ర సముద్ర కారిడార్‌లో రాకపోకలు సాగించే అమెరికా వాణిజ్య నౌకలపై ప్రతీకార దాడులు తప్పవని హౌతీలు హెచ్చరించారు. అమెరికా నౌకలను, వైమానిక, నావికాదళ ఆస్తులను రక్షించుకోవడానికి హౌతీలను అంతమొందించేంత వరకు దాడులు కొనసాగిస్తామని ట్రంప్ సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. అమెరికా అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తూ ఈ ప్రాంతంలో అనేక యుద్ధ నేరాలకు పాల్పడుతోందని, అనేక మంది అమాయక పౌరులను పొట్టనబెట్టుకుంటున్నదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చీ విమర్శించారు.

ముస్లింలకు పవిత్ర మాసమైన రంజాన్ నెలలో శనివారం రాత్రి భోజన సమయంలో రాజధాని సనాపై అమెరికా బాంబుల వర్షం కురిపించింది. జనవరిలో ట్రంప్ అమెరికా అధ్యక్షుడు అయిన తర్వాత మధ్యప్రాచ్యంలో అమెరికా విస్తృత దాడులకు దిగడం ఇదే మొదటిసారి. అణు చర్చలకు సంబంధించి ఇరాన్‌పై ఒత్తిడి తేవడానికి ఆ దేశంపై ట్రంప్ మరిన్ని ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే.

ప్రైవేటుకు ఆర్‌టిసి బస్ స్టేషన్లు

(మొదటి పేజీ తరువాయి)

రాకపోకలు సాగిస్తున్నట్లు అంచనా. రాష్ట్రంలో విజయవాడ, గుంటూరు, విశాఖ, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కర్నూలు ఉమ్మడి జిల్లాల్లోని పలు ఆర్‌టిసి బస్ స్టేషన్లలోని ఖాళీ స్థలాల విలువ రూ.కోట్లలో ఉంటుంది. దీంతో ఆయా బస్ స్టేషన్లను కార్పొరేట్స్ పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

ఆర్‌టిసి బస్ స్టేషన్ల ప్రైవేటీకరణను విడనాడాలి : ఎస్‌డబ్ల్యుఎఫ్

కేంద్ర ప్రభుత్వం ఒత్తిడితో ఆర్‌టిసి బస్ స్టేషన్లను ప్రైవేటీకరణకు పూనుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం.. కార్మికుల భద్రతకు ఎలాంటి హామీనివ్వకపోవడంతో ఆర్‌టిసి ఉద్యోగుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. బస్ స్టేషన్ల అభివృద్ధి పేరుతో ప్రైవేటీకరణ దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలు, ప్రయాణికులు వ్యతిరేకించాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ విజ్ఞప్తి చేసింది. ప్రైవేటీకరణ విధానాలను విడనాడాలని డిమాండ్ చేసింది.

మత్తు పదార్థాలు విక్రయిస్తున్న మహిళ అరెస్టు

ప్రజాశక్తి-బాపట్ల

యువతను మత్తుకు బానిసలను చేసే విధంగా టాబ్లెట్ల రూపంలో రహస్యంగా మత్తు పదార్థాలను విక్రయిస్తున్న ఓ మహిళను ఎక్సైజ్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. బాపట్ల ఎక్సైజ్ సిఐ పి.గీతిక తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల మండలం వెదుళ్ళపల్లిలో ఓ మహిళ తన గృహంలో వైద్యులు నొప్పులకు ఉపయోగించే మందు బిళ్లలను యువతకు అధిక మొత్తంలో విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడిందని తెలిపారు. ఈ మందులు మత్తు కలిగించేందుకు మాత్రల రూపంలో, ఇంజక్షన్ల రూపంలో యువతకు ప్రధానంగా విద్యార్థులకు విక్రయిస్తోందన్నారు. ఆమె వద్ద ఉన్న టాబ్లెట్లను స్వాధీనం చేసుకుని జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించినట్లు తెలిపారు. నొప్పులకు వైద్యులు వినియోగించే ఈ మాత్రలు అధిక మోతాదులో ఉపయోగిస్తే మెదడు, శరీరంపై దాని ప్రభావం చూపుతాయని చెప్పారు. మెడికల్ షాపుల్లో విక్రయించే ఈ మాత్రలు 1600 వరకు ఈ మహిళ దగ్గర ఉన్నట్లు గుర్తించామన్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కార్మికుల భద్రత, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

- కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

ప్రజాశక్తి-కాకినాడ



ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

కార్మికుల భద్రత, ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కార్మిక శాఖామంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కాకినాడలో ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 54వ జాతీయ భద్రత వారోత్సవాల అవగాహన ర్యాలీని ఆయన ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 54వ జాతీయ భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని కార్మికులతో పాటు సామాన్య ప్రజానీకంలో కూడా భద్రత పట్ల అవగాహన కల్పించే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భద్రతా వారోత్సవాల్లో కార్మికుల కుటుంబ సభ్యులను కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్మికులు భద్రంగా, ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రం భద్రంగా ఉంటుందని తెలిపారు. పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికుల పట్ల యాజమాన్యాలు మరింత బాధ్యత తీసుకోవాలని సూచించారు. భద్రతా నియమావళిని కార్మికులందరికీ అర్థమయ్యేలా స్థానిక భాషలో రూపొందించాలని తెలిపారు. రసాయన పరిశ్రమల్లో పనిచేసే కార్మికులందరికీ రసాయనాల పట్ల, వాటి వలన జరిగే ప్రమాదాల పట్ల శిక్షణా తరగతులను నిర్వహించాలని, ప్రమాదాల్ని ముందుగానే పసిగట్టి నివారించేటట్లు టెక్నాలజీని వాడుకోవాలని తెలిపారు. ప్రతి పరిశ్రమలోనూ భద్రత సెన్సార్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కార్మికులందరూ తప్పనిసరిగా సేఫ్టీ కిట్స్ వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపి ఫ్యాక్టరీస్ డైరెక్టర్ డి.చంద్రశేఖర్‌వర్మ, ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్.భావన, జిల్లా అగ్నిమాపక అధికారి పివిఎస్.రాజేష్, పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యమ నేత దాసు కన్నుమూత

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)



పోస్టల్ ఉద్యమ నేత, పోస్టల్ ఉద్యోగుల జెఎసి కన్వీనర్, కేంద్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షులు ఎస్.దాసు అనారోగ్యంతో విశాఖలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో ఆదివారం సాయంత్రం కన్నుమూశారు. ఆయనకు ఒక కుమారుడు ఉన్నారు. దాసు ఉద్యోగ సమయంలోనూ, ఉద్యోగ విరమణ అనంతర కాలంలోనూ అనేక పోరాటాలకు నేతృత్వం వహించారు. 1939 నవంబర్ 1న ఉమ్మడి విశాఖ జిల్లాలోని అచ్యుతాపురం మండలం కొండకర్లలో ఆయన జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసమంతా అక్కడే సాగింది. అనంతరం విశాఖలో చదువును కొనసాగించారు. ఉద్యోగంలో చేరిన తొలినాళ్లలోనే తపాలా శాఖలో ఉద్యమ బాట పట్టారు. 1997లో ఉద్యోగ విరమణ చేశారు. అనంతర కాలంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల ఉద్యమాల్లో ఎత్తిన జెండా దించకుండా పోరుబాటలో నడిచారు. 85 సంవత్సరాల వయసులో కూడా ఆయన ఉద్యమాల్లో పాల్గొనడం అందరికీ ఉత్సాహాన్నిచ్చేది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పోస్టల్ ఉద్యమ నాయకుల్లో ఒకరిగా ఉన్న ఆయన మృతి పలువురిని కలిచివేసింది. సోమవారం ఉదయం 8 గంటలకు గవర కంచరపాలెంలోని ఆయన ఇంటి వద్ద భౌతికకాయాన్ని ఉంచుతారు. అనంతరం అంత్యక్రియలు జరుగుతాయి.

పలువురు సంతాపం

దాస్ మృతి పట్ల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమన్వయ కమిటీ, డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ, కాన్ఫడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సంతాపం తెలిపాయి. ఆయన మృతి ఉద్యమాలకు తీరనిలోటని డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్ రెడ్డి వెంకటరావు, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాస్, ఆర్‌కెఎస్‌వి.కుమార్ వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని పోస్టల్, ఆర్ఎంఎస్ ఉద్యోగులకు తలలో నాలుకగా ఉంటూ, అందరి ఆదరాభిమానాన్నీ దాస్ పొందారని గుర్తుచేసుకున్నారు.

కొత్త వ్యోమగాములకు సునీత, విల్మోర్ స్వాగతం

(మొదటి పేజీ తరువాయి)

నాసా తెలిపింది. అన్నీ అనుకూలిస్తే బుధవారం వారిద్దరూ తిరగి భూమి మీదకు చేరుకోవచ్చన ఐఎస్ఎస్ ప్రోగ్రామ్ మేనేజర్ డానా వీగెల్ చెప్పారు.

అంతరిక్ష నౌక భూమికి తిరిగి రావడానికి సుదీర్ఘ ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుంది. ఇందుకోసం అంతరిక్ష నౌకను సరైన పథంలోకి తీసుకువచ్చి నెమ్మదిగా భూమి వాతావరణంలోకి తీసుకువస్తారు. వాతావరణంలోకి ప్రవేశించేటప్పుడు ఉత్పన్నమయ్యే వేడి, మంటల నుండి అంతరిక్ష నౌకను, ప్రయాణీకులను రక్షించడానికి అంతరిక్ష నౌక ముందు భాగంలో అధిక నాణ్యత గల ఉష్ణ కవచాలను అమర్చుతారు. ఇవి అగ్నిమాపక యంత్రాలతో పాటు లోపల ఉన్న పరికరాలను, ప్రయాణీకులను చల్లగా ఉంచుతాయి, తీవ్రమైన వేడి నుండి వారిని రక్షిస్తాయి.

నకిలీ దళారులపై కేసు

- టిటిడి చైర్మన్ సెక్రటరీ అంటూ రూ. 2.60 లక్షలు వసూళ్లు

ప్రజాశక్తి - తిరుమల

టిటిడి చైర్మన్ జనరల్ సెక్రటరీ పేరుతో ఇద్దరు దళారులు శ్రీవారి యాత్రికులను మోసం చేసిన వైనం తిరుమలలో ఆదివారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడుకు చెందిన సంఘమిత్ర అనే యువతి విజయవాడలోని సిద్ధార్థ కాలేజీలో పిజి చదువుతున్నారు. ఆమె తిరుమల శ్రీవారిని దర్శించుకోవాలని అనుకున్నారు. ఇందు కోసం టిటిడి చైర్మన్ జనరల్ సెక్రటరీ అని చెప్పుకునే నకిలీ వ్యక్తులైన దీపుబాబు, పవన్ కుమార్ అనే దళారులను ఆమె ఆశ్రయించారు. శ్రీవారి దర్శనానికి సంబంధించిన ఐదు విఐపి బ్రేక్ దర్శనం టికెట్లు, మరో ఐదు సుప్రభాతం టికెట్లు ఇప్పిస్తామని చెప్పి సంఘమిత్ర నుంచి ఫోన్‌పే ద్వారా రూ.2.60 లక్షలు దళారులు వసూలు చేశారు. ఆ తర్వాత మొబైల్ ఫోన్ స్విచాఫ్ చేసేశారు. దీంతో తాను మోసపోయానని గ్రహించి తిరుమల టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువతి ఫిర్యాదు మేరకు శనివారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు.

బిజెపి మైకంలో పవన్ : షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఇప్పటికైనా మేల్కొని బిజెపి మైకం నుంచి బయటపడాలని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల కోరారు. చేగువేరా, గద్దర్ సిద్ధాంతాలకు పవన్ నీళ్లొదిలేశారని, ఇప్పుడు మోడీ, అమిత్ షా సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకున్నారని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని నరనరాన జీర్ణింపజేసుకున్నారని, జనసేన పార్టీని 'మత సేన'గా మార్చారని విమర్శించారు. జనం కోసం పుట్టిన పార్టీ అని చెప్పి ఒక మతానికి అజెండాగా మార్చడం దారుణమన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో విభజించి పాలించు అన్నట్లుగా పవన్ వైఖరి ఉండటం విచారకరమన్నారు. పార్టీ పెట్టి 11 ఏళ్లు పోరాడి, ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి, మతం రంగు పూసుకుని, ఒకరి ప్రయోజనాలే లక్ష్యం అన్నట్లుగా మాట్లాడటాన్ని కాంగ్రెస్ పార్టీ ఖండిస్తుందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలతో పుట్టిన పార్టీ అని చెప్పి, మత పిచ్చి బిజెపి ఆశయాలను అలవర్చుకోవడం దారుణమన్నారు.

డప్పు కళాకారుల సమస్యలపై 18న విజయవాడలో మహాధర్నా

- రాష్ట్ర అధ్యక్షులు ఎండి.ఆనంద్‌బాబు

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

రాష్ట్రంలో డప్పు కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల18న విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండి.ఆనంద్‌బాబు కోరారు. కర్నూలులోని కార్మిక కర్షక భవన్‌లో ఎండి ఆనంద్ బాబు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొత్తగా అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 1,50,000ల పెన్షన్లు తొలగిస్తామని ప్రకటించారన్నారు. ఈ ప్రకటనతో గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ జోక్యం పెరిగిందన్నారు. దీంతో అనర్హుల పెన్షన్లు తొలగించకుండా అర్హుల పేర్లను తొలగిస్తున్నారని తెలిపారు. డప్పు కళాకారులకు ఇతర కళాకారులకు ఇచ్చే రూ.7 వేలు పెన్షన్‌ను ఇవ్వాలని కోరారు. పెన్షన్ వయసు 45 సంవత్సరాలకే తగ్గించాలని, వయసుతో సంబంధం లేకుండా డప్పు గజ్జలు, డ్రెస్సు అందరికీ ఇవ్వాలనే డిమాండ్లతో జరుగుతున్న ఈ మహాధర్నాకు డప్పు కళాకారులు అత్యధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కాటికాపరుల సంఘం జిల్లా కార్యదర్శి ఎన్‌జి.కృష్ణ, డప్పు కళాకారుల సంఘం కర్నూలు కల్లూరు మండల కార్యదర్శులు జె.వెంకటేష్, ఎన్ చక్రపాణి, కర్నూలు నగర నాయకులు దస్తగిరి పాల్గొన్నారు.

పబ్లిక్ ఇష్యూకు ఆల్‌కెమ్ లైఫ్‌సైన్స్

- సెబీకి డిఆర్‌హెచ్‌పి సమర్పణ

హైదరాబాద్ : ఫార్మా రంగంలోని యాక్టివ్ ఫార్మా ఇంగ్రీడియెంట్స్ (ఎపిఐ) ఇంటర్మీడియట్స్, స్పెషాలిటీ కెమికల్స్ తయారు చేసే ఆల్‌కెమ్ లైఫ్‌సైన్స్ లిమిటెడ్ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్‌కు సిద్ధం అయ్యింది. ఇందుకోసం తమ ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను (డిఆర్‌హెచ్‌పి) మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించింది. ఈ ఇష్యూ ద్వారా రూ.190 కోట్ల వరకు విలువ చేసే షేర్లను తాజాగా జారీ చేయనుంది. మరో 71,55,000 షేర్లను ఆఫర్ ఫర్ సేల్ విధానంలో విక్రయించనుంది. ఈ షేర్ల ముఖ విలువ రూ. 10గా ఉంటుంది. సమీకరించిన నిధుల్లో సుమారు రూ. 130 కోట్లను నిర్దిష్ట రుణాల చెల్లింపునకు, కార్పొరేట్ అవసరాలు, ఇతరత్రా వ్యాపార అవసరాల కోసం కంపెనీ ఉపయోగించుకోనుంది.

అదానీ గంగవరం పోర్టు కాలుష్యంపై ధర్నా

- సమస్య పరిష్కరించకపోతే ప్రజాఉద్యమం : సిపిఎం



వై.జంక్షన్‌లో ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు, స్థానిక ప్రజలు

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)

అదానీ గంగవరం పోర్టు కాలుష్యాన్ని అరికట్టాలంటూ సిపిఎం ఆధ్వర్యాన విశాఖ గాజువాకలోని వై జంక్షన్ వద్ద ఆదివారం ధర్నా నిర్వహించారు. దీనికి స్థానికులు మద్దతు తెలిపారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి పార్టీ జిల్లా కార్యదర్శి ఎం జగ్గునాయుడు మాట్లాడుతూ పోర్టు కాలుష్యాన్ని అరికట్టకపోతే ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. అదానీ పోర్టు యాజమాన్యం వందల కోట్ల రూపాయల లాభాలను ఆర్జిస్తోందని, కాలుష్యం వెదజల్లుతూ ప్రజలను తీవ్ర అనారోగ్యాల బారిన పడేస్తోందని తెలిపారు. భారీ వాహనాలతో పోర్టు రోడ్డులో లోడ్‌ను తీసుకెళ్తున్న క్రమంలో రసాయనాలు, బూడిద ఎగిరి ప్రజల ఇళ్లలోకి చేరుతోందన్నారు. కాలుష్య సమస్యను పరిష్కరిస్తామని ఎన్నికలకు ముందు చెప్పి గెలిచిన స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎంపి శ్రీభరత్ ఇప్పుడు ఏమయ్యారని ప్రశ్నించారు. సమస్య పరిష్కారమయ్యేంత వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. పార్టీ గాజువాక జోన్ కార్యదర్శి ఎం రాంబాబు మాట్లాడుతూ పోర్టు కాలుష్యం వల్ల చాలా మంది కేన్సర్, ఊపిరితిత్తుల వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. లోడ్‌తో వెళ్తున్న లారీలపైనా, రైలు వేగన్ల మీదా కనీసం టార్పాలిన్లు కూడా వేయడం లేదన్నారు. స్థానికులు జగదీష్, రమణమూర్తి మాట్లాడుతూ లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన తమ ఇళ్లలో పోర్టు కాలుష్యం వల్ల నివసించలేకపోతున్నామని వాపోయారు. పోర్టు భారీ వాహనాల వల్ల రోడ్లు దెబ్బతింటున్నాయని తెలిపారు. ధర్నాలో తోకాడ సమైక్య అపార్టుమెంట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎం వెంకటేశ్వరరావు, వార్వా, నివాస్ నాయకులు త్రినాధస్వామి, సిపిఎం నాయకులు బంగారు నాయుడు, పివైవి రమణరావు, ఎ లోకేశ్వరరావు, ఎన్ రాజేంద్రప్రసాద్, గొలగాన అప్పారావు, సత్యనారాయణ రాజు, ఐద్వా నాయకులు ఎం శ్రీదేవి, లక్ష్మి, సిఐటియు నాయకులు డి రమణ, బి రమణ పాల్గొన్నారు. ధర్నాతో వై జంక్షన్‌లో పోర్టు లారీలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ పోలీసులు హడావుడి చేయగా స్థానికులు ప్రతిఘటించారు. 'మా కాలుష్య సమస్య మీకు పట్టదా?' అని ప్రశ్నించేసరికి వారు వెనక్కుతగ్గారు.


సైకిల్ తొక్కుతున్న అనకాపల్లి, అల్లూరి జిల్లాల కలెక్టర్లు

శారీరక శ్రమ, యోగాపై అవగాహన

- సైకిల్ తొక్కిన అనకాపల్లి, అల్లూరి జిల్లాల కలెక్టర్లు

ప్రజాశక్తి - అనకాపల్లి

శారీరక శ్రమ, యోగాపై అవగాహన కల్పిస్తూ అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లు ఎస్.దినేష్ కుమార్, కె.విజయ్ కృష్ణన్ (ఇద్దరూ భార్యాభర్తలు) అనకాపల్లి పట్టణంలో ఆదివారం సైకిల్ తొక్కుతూ సందడి చేశారు. స్థానికులను ఉత్సాహపరిచారు. అనకాపల్లి యోగా లైఫ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ సైకిల్ యాత్ర చేపట్టగా వారిరువురూ హాజరయ్యారు. తుమ్మపాల చినబాబు కాలనీ నుంచి బొజ్జన్న కొండ వరకు ఈ సైకిల్ యాత్ర సాగింది. ఎప్పుడూ విధి నిర్వహణలో బిజీగా గడిపే జిల్లా కలెక్టర్లు ఇలా రోడ్డుపై సైకిల్ తొక్కడం స్థానికులను కనువిందు చేసింది. యాత్ర అనంతరం మెట్ల మార్గం ద్వారా కలెక్టర్లు విజయ్ కృష్ణన్, దినేష్ కుమార్ బొజ్జన్న కొండెక్కారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం తప్పనిసరి అన్నారు. ఫేస్‌బుక్, ఇతర సామాజిక మాధ్యమాల పోస్టులతో కాలయాపన చేయకుండా శారీరక శ్రమ చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సైకిల్ యాత్రలో పాల్గొనడం ఆనందాన్ని కలిగించిందన్నారు. కార్యక్రమంలో యోగా లైఫ్ సెంటర్ ఫౌండర్ కరణం బాబూరావు, ప్రముఖ వైద్యులు జి.రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

చంపుతామని బెదిరిస్తున్నారు

- దస్తగిరి భార్య షేక్ షబానా

ప్రజాశక్తి - పులివెందుల టౌన్


విలేకరులతో మాట్లాడుతున్న షేక్ షబానా

తన భర్తను, తన కుటుంబాన్ని చంపుతామని వైసిపికి చెందిన మహిళలు బెదిరించి దాడి చేశారని మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి భార్య షేక్ షబానా తెలిపారు. వైఎస్ఆర్ జిల్లా పులివెందులలో ఆమె ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. శనివారం సాయంత్రం పులివెందుల నియోజకవర్గం తొండూరు మండలం మల్లెల గ్రామంలో ఉన్న తన తండ్రికి అనారోగ్యంగా ఉంటే ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించానని తెలిపారు. చికిత్స అనంతరం తన తండ్రిని తిరిగి మల్లెల గ్రామంలో వదిలి పెట్టడానికి వెళ్లానని, అక్కడ వైసిపికి చెందిన కొంతమంది మహిళలు తనపై దాడి చేశారని తెలిపారు.

'వివేకానందరెడ్డి హత్య కేసులో నీ భర్త తప్పుడు సాక్ష్యం చెబుతున్నాడు. నీ భర్తను చంపేస్తాం' అని బెదిరించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్.అవినాష్‌రెడ్డి, మల్లెల రవీంద్రనాథ్‌రెడ్డి మిమ్మల్ని వదిలి పెట్టరని బెదిరించినట్లు దస్తగిరి సతీమణి తెలిపారు. ఈ విషయమై తొండూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐకి ఫిర్యాదు చేయగా పట్టించుకోలేదని, దీంతో పులివెందుల రూరల్ సిఐ వెంకటరమణకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.



కోకో రైతు కుదేలు

- గతేడాది కిలో వెయ్యి... ప్రస్తుతం రూ.600
- సిండికేటైన కంపెనీలు!
- అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ ఉన్నా దక్కని ధర

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం విజన్ 2047 గురించి గొప్పగా ప్రచారం చేసుకుంటోంది. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా ధరలు కల్పిస్తామని చెప్తోంది. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ప్రస్తుతం 5.5 శాతం ఉన్న ఈ ఉత్పత్తుల ఎగుమతులు 2029 నాటికి 30 శాతం పెంచుతామని విజన్ డాక్యుమెంట్‌లో పేర్కొంది. ప్రభుత్వ ప్రోత్సాహం కరువవ్వడంతో గిట్టుబాటు ధర రాక రైతులకు చుక్కలు కనిపిస్తున్నాయి. దీనికి కోకో రైతులే ఉదాహరణ.

కోకో పంటకు ధర లేక రైతులు కుదేలవుతున్నారు. గతేడాది కిలో వెయ్యి రూపాయలు పలకగా ప్రస్తుతం రూ.600కు పడిపోయింది. కోకో గింజలు కొనుగోలు చేసే కంపెనీలు సిండికేటై రైతులకు సరైన ధర దక్కకుండా చేస్తున్నాయి. తమకు అంతర్జాతీయ మార్కెట్లో ఉన్న ధర అందేలా చూడాలని రైతులు రోడ్డెక్కి గగ్గోలు పెడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. గతేడాది పలికిన ధరకు, ప్రస్తుత ధరకు మధ్య భారీ వ్యత్యాసం ఉండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

ఉమ్మడి పశ్చిమగోదావరిలో 50 వేల ఎకరాల్లో కోకోను సాగు చేశారు. కోకో గింజలను చాక్లెట్, కేకులు వంటివాటి తయారీలో అధికంగా వినియోగిస్తున్నారు. కొబ్బరి, పామాయిల్ తోటల్లో అంతర్ పంటగా కోకోను సాగు చేస్తున్నారు. ఎకరా కొబ్బరి తోటలో 180 నుంచి 240 మొక్కలు, పామాయిల్ తోటలో 150 మొక్కలు వరకూ నాటుతారు. ఒక ఎకరాలో సాగుకు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకూ పెట్టుబడి అవుతోంది. ఎకరాకు రెండున్నర క్వింటాళ్ల నుంచి నాలుగు క్వింటాళ్ల వరకూ దిగుబడి వస్తోంది. జనవరి నుంచి జూన్ వరకూ కోకో సీజన్ ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం కోకో సీజన్ ముమ్మరంగా సాగుతోంది. పాత, కొత్త పంట మొత్తం వెయ్యి టన్నుల వరకూ రైతులు వద్ద ఉన్నట్లు సమాచారం.

గతేడాది అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుగుణంగా కిలో కోకో గింజలకు వెయ్యి రూపాయలు ధర పలికింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో కిలో ధర రూ.900 ఉంది. రైతుల నుంచి రూ.600కు మించి కంపెనీలు కొనుగోలు చేయడం లేదు. అంతరాష్ట్రీయ మార్కెట్ ధరతో పోలిస్తే రైతులు కిలోకు దాదాపు రూ.300 వరకూ నష్టపోతున్నారు. ఎకరాకు దాదాపు రూ. 70,000 నష్టపోతున్నారు. దాదాపు 20 కంపెనీలు, ట్రేడర్స్ రైతుల నుంచి కోకో గింజలను సేకరిస్తున్నారు. కంపెనీలన్నీ సిండికేట్‌గా మారి రైతులకు ధర దక్కకుండా చేస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో పంటకు ధర అమలు చేయాలని గత కొన్ని రోజులుగా రైతులు ఆందోళనలు చేస్తున్నారు. జిల్లా మొదలుకుని రాష్ట్ర స్థాయి అధికారుల వరకూ అందరినీ కలిసి తమ గోడును వెల్లబోసుకుంటున్నారు. ఏ ఒక్క అధికారి వారి మొయి ఆలకించలేదు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని కంపెనీల సిండికేట్‌ను అరికట్టి అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా ధర అందేలా చర్యలు తీసుకోవాలని కోకో రైతులు డిమాండ్ చేస్తున్నారు.

అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ధర ఇవ్వాలి



నేను, మా అన్నయ్య మొత్తం 36 ఎకరాల్లో కోకో సాగు చేశాం. అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో కోకో గింజల ధర రూ.900 వరకూ ఉన్నప్పటికీ ఇక్కడ మాత్రం ఈ ధరకు కొనుగోలు చేయడం లేదు. అంతర్జాతీయ మార్కెట్ ధర ప్రకారం కొనుగోలు చేయాలి.

-పానుగంటి అచ్యుత రామయ్య, లక్ష్మీపురం, ఏలూరు మండలం

ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి



30 ఎకరాల్లో కోకో సాగు చేశాను. కంపెనీలు సిండికేటై తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నాయి. ప్రభుత్వం జోక్యం చేసుకొని అంతర్జాతీయ మార్కెట్లో ఉన్న ధర రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలి.

-బి.రామకృష్ణ, బాపిరాజుగూడెం, పెదవేగి మండలం

ధరల అమలుకు కమిటీలు

ధరల అమలుకు ప్రభుత్వం కమిటీలు వేసింది. నాణ్యత ఉన్న గింజల కొనుగోలులో ఇబ్బంది లేదు. గతేడాది పంట రైతుల వద్ద 30 శాతం వరకూ ఉంది. ప్రస్తుతం కిలో కోకో గింజలు ధర రూ.600 వరకూ ఉంది.

- ఎస్. రామ్మోహన్, ఉద్యాన శాఖ అధికారి, ఏలూరు జిల్లా

శాంసంగ్ నుంచి గెలాక్సీ ఎఫ్16 5జి

న్యూఢిల్లీ : సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ కొత్తగా గెలాక్సీ ఎఫ్ 16 5జి స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. మీడియా డైమెన్సిటీ 6300 ప్రాసెసర్, 8జిబి ర్యామ్, 128 జిబి స్టోరేజీతో దీన్ని ఆవిష్కరించింది. ప్రారంభ ధరను రూ.13,499గా నిర్ణయించింది. 6.7 అంగుళాల డిస్‌ప్లే కలిగిన ఈ ఫోన్‌లో 5,000 ఎంఎహెచ్ బ్యాటరీ. 50 ఎంపి ప్రైమరీ కెమెరా, 5ఎంపి, 2ఎంపి కెమెరాలు సహా సెల్ఫీ కోసం 13 ఎంపి కెమెరాను అమర్చింది.

శాస్త్రీయ సమాజం నిర్మాణానికి కృషి

- జన విజ్ఞాన వేదిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాస్త్రీయ సమాజాన్ని నిర్మించేందుకు యువత, ఉపాధ్యాయులు, విద్యావంతులు, మేధావులు కృషి చేయాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ఎం గేయానంద్, ప్రొఫెసర్ ఎ.రామచంద్రయ్య పిలుపునిచ్చారు. జెవివి రాష్ట్ర ఎడ్యుకేషన్ సబ్ కమిటీ ఆధ్వర్యాన నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ ప్రయోగాల వినూత్న పోటీలు-2025 (యురేకా సైన్స్ ఎక్స్‌పో-2025) ఫలితాలను ఆదివారం ఆన్‌లైన్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా జెవివి ఎడ్యుకేషన్ సబ్ కమిటీ రాష్ట్ర కన్వీనరు గొంటి గిరిధర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ.. సమాజంలోని అన్ని సమస్యలకూ పరిష్కారం సైన్స్ మాత్రమే చూపిస్తుందన్నారు. కోవిడ్ సందర్భంగా వైద్యరంగ నిపుణులు, శాస్త్రవేత్తలు, డాక్టర్లు చేసిన కృషితో ప్రపంచం కోవిడ్ నుంచి బయటపడిందన్నారు. జెవివి వ్యవస్థాపకులు ఎన్ఐటి వరంగల్ పూర్వ ఆచార్యులు ప్రొఫెసర్ ఎ.రామచంద్రయ్య మాట్లాడుతూ.. సమాజంలో అశాస్త్రీయ భావనలను తొలగించడానికి, శాస్త్రీయ సమాజ నిర్మాణానికి జన విజ్ఞాన వేదిక గత 37 ఏళ్లుగా కృషి చేస్తుందన్నారు. జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు మాట్లాడుతూ.. యురేకా సైన్స్ ఎక్స్‌ఫో, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం-సుస్థిరాభివృద్ధి, మూఢ నమ్మకాలు-శాస్త్రీయ దృక్పథంపై నిర్వహించామన్నారు. పోటీల్లో 26 జిల్లాల నుంచి 1,015 మంది విద్యార్థులు పాల్గొనగా, రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి విజేతలను ప్రకటించారు. వీరందరికీ ఈ నెలాఖరులోగా ఆయా జిల్లా కమిటీల ద్వారా బహుమతులు అందజేస్తామని తెలిపారు. యురేకా సైన్స్ ఎక్స్‌ఫో న్యాయ నిర్ణేతలు ఎంఎస్ యుగంధర్ బాబు, ఎస్‌కె జిలాని భాషా మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రయోగాలు.. మూఢ నమ్మకాలు సమాజాభివృద్ధికి ఆటంకం అని తెలిపే విధంగా ఉన్నాయని, వినూత్న ఆలోచనలతో కొత్త ఆవిష్కరణలకు నాంది పలికే విధంగా కృషి చేశారని అభినందించారు. ఈ కార్యక్రమంలో యురేకా సైన్స్ ఎక్స్‌ఫో సాంకేతిక నిపుణులు జి మహేష్, హయ్యర్ ఎడ్యుకేషన్ సబ్ కమిటీ కన్వీనరు వైఎస్ నాగేశ్వర్, జెవివి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్షరం

ప్రజాశక్తి

www.prajasakti.com

facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ
సోమవారం 17 మార్చి 2025



"శాస్త్రం నీ అస్త్రం
మౌనం శ్మశానం అది కాదు జ్ఞానం
పరీక్షించు సహేతుకంగా
ప్రసంగించు సాధికారికంగా
సమిష్టి సూత్రం సరైన విధానం"
– శ్రీశ్రీ



కవిత్వం చిరంజీవి

కవిత్వం మనిషంత ప్రాచీనం
ఆదికవులంటూ ఎవరూ లేరు, ఆదిమ కవులు తప్ప.
కవిత్వం మానవానుభవ కళారూపం
అది భారతి దయాకాదు,
దైవ ప్రసాదమూ కాదు.
కవులు సానబట్టిన వజ్రం కవిత్వం.
కవిత్వం మారుతుంది
మనిషి లాగా, జగతి లాగా.
కవిత్వం మనం స్నేహం
అవసరమైతే మన పాలిటి కరవాలం
రెండువైపులా పదునున్న కత్తి కవిత్వం
మనల్ని నిద్దుర లేపుతుందీ, నిద్రపుచ్చుతుంది కూడా.
రాజులను పొగిడింది
జమీందారులను కీర్తించింది
ప్రజలకు జేకొట్టింది.
కవిత్వం కాలజ్ఞాని
సమయస్ఫూర్తి
కవిత్వానికి తెలిసిన కళ.
వాణి నా రాణి అన్న వారిని
కాల సముద్రంలో కలిపేసింది
కవిత్వం పెంపుడు చిలుక కాదు
పలుకమన్నట్లు పలకడానికి.
కవిత్వం పెంపుడు జంతువు కాదు
ఆడమన్నట్లు ఆడడానికి.
కవిత్వం ఆత్మగౌరవ కళ .
దానికి ఆకాశంలో తలలూపే కొమ్మలే కాదు
నేలలోని తల్లివేరు కూడా తెలుసు
కవిత్వాన్ని మనిషి భిక్షాపాత్రను చేశాడు
రక్షాకవచం చేసుకున్నాడు
అందమైన అల్లిక చేశాడు
ఆగ్రహజ్వాలిక చేశాడు
ఉద్యమ గీతిక చేశాడు
ఉబుసుపోక బొమ్మనూ చేశాడు.
కవిత్వం ఒక అమీబా.
తిలక్ చెప్పినట్లు కవిత్వం
ఒక ఆల్కెమీ.
అది కవికే తెలుసు.
కవిత్వం పుట్టుకే గాని
మరణం లేని చిరంజీవి
మనిషి నుంచి మనిషికోసం పుట్టిన అమృతభాండం.
అది చిరంజీవి!

(ఈనెల 21 ప్రపంచ కవిత్వదినోత్సవం సందర్భంగా ప్రపంచ కవులకు శుభాకాంక్షలతో)

– రాచపాళెం
94402 22117

గతితప్పిన పవనాలు

ఎర్ర కండువా
ఆయన మెడలో కనిపించడంలేదు
శ్రీశ్రీ, శేషేంద్రశర్మ
గొంతులో వినిపించడంలేదు
చేగువేరా, పూలే, గాంధీ ఫోటోలు
ఎక్కడా పోస్టర్లపై వేయించడం లేదు!

చేగువేరా మరో అవతారాన్ని అన్నాడు
కమ్యూనిస్టులు తన సహజ మిత్రులన్నాడు
సముద్రం ఒకడి కాళ్ళ దగ్గర కూర్చొని మొరగదన్నాడు!
ఉత్తరాది దురహంకారంపై యుద్ధమన్నాడు
చివరకు బీజేపీ పాచి లడ్డూలే
మహా ప్రసాదం అంటున్నాడు!

అప్పుడు కష్టజీవులకు, కార్మికులకు ప్రతినిధినన్నాడు!
ఇప్పుడు మతానికి, ఉద్వేగానికి
ప్రతినిధిని అంటున్నాడు!
చేగువేరా దగ్గర మొదలు పెట్టాడు
సావర్కర్ దగ్గరకొచ్చి ఆగాడు
గతి తప్పిన రాజకీయ ఋతుపవనాలు
మతితప్పిన వ్యవహారాలు!

ప్రాణవాయువై ప్రజాస్వామ్యానికి ఊపిరి పోస్తానన్నాడు
అపానవాయువై మతతత్వపు గబ్బు లేపుతున్నాడు!

– రాము ఉప్పాడ,
9676051509

సత్య వాక్కులు

ప్రశ్నించే వాడు లేకపోతే
పాలించే వాడు చెప్పిందే వేదం
పొగరు చూరెక్కి వెక్కిరిస్తుంది

పోరాడే వాడు లేకపోతే
నిరంకుశలదే శాసనమౌ
నాశనానికి దారి తీస్తుంది

ఎదిరించే వాడు వెనకడుగు వేస్తే
పిల్లులే బెదిరింపుకు దిగుతాయి
ఎలుకలు ఎకసెక్కాలాడతాయి

నిజాలు నలిగి చావకూడదంటే
'వేము' అబద్ధాలను పిండేయాలి
పేము బెత్తంతో స్వచ్ఛత తీయాలి

– ఉన్నం వెంకటేశ్వర్లు

23న ప్రపంచ కవితా దినోత్సవ సభ

కవి సంధ్య, చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో ప్రపంచ కవితా దినోత్సవ సభ 23 మార్చి 2025 ఆదివారం సాయంత్రం 5 గంటలకు హైదరాబాదులోని పొట్టి శ్రీరాములు తెలుగువిశ్వ విద్యాలయంలో జరుగుతుంది. తొలుత సుధామ అధ్యక్షతన కవి సమ్మేళనం, తరువాత శిఖామణి అధ్యక్షతన జరిగే సభలో దర్భశయనం శ్రీనివాసాచార్య కవిత్వం– ప్రయోజనం అంశంపై ప్రసంగం ఉంటాయి. కవితల పోటీ విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుంది. ఆచార్య ఎన్. గోపి, ఓల్గా, దీర్ఘాశి విజయ్ భాస్కర్, మామిడి హరికృష్ణ, ఏనుగు నరసింహారెడ్డి, కొప్పర్తి, ప్రసాదమూర్తి, యాకూబ్, కోడూరి విజయ్ కుమార్, కోయి కోటేశ్వర రావు, చిన్ని నారాయణ రావు పాల్గొంటారు.

– కవి సంధ్య

సమకాలీన తెలుగు కథ – సామాజికత


పరిశీలన

కథ, కథానిక పదాలను పర్యాయ పదాలుగా వాడుతున్నాం. సమగ్రమైన కథానిక లక్షణాలను పుణికిపుచ్చుకున్న కథానిక దిద్దుబాటు. గురజాడ 1910లో ఈ కథను రాశారు. ఒక వ్యక్తి జీవితంలో జరిగే సంఘటనలను కళాత్మకంగా చిత్రీకరించేది కథానికవుతుంది. క్లుప్తత, గాఢత ప్రధానంగా ఉంటాయి. సమాజంలోని వ్యక్తులను సరిదిద్దే ప్రయత్నంతోనే కథానిక అడుగులు మొదలయ్యాయి. ఆధునిక కాలంలో కథలు సామాజిక సంఘటనలను, మార్పులను పరిణామాలను, మన జీవితాల్లో క్రమంగా వచ్చే చర్యను మన ముందు ఉంచుతుంది. ఒక సమాజానికి కథలు కీలకమైన సాక్ష్యంగా నిలుస్తాయి. సామాజిక పరిణామాలను ప్రతిఫలనాలను సాహిత్యం రికార్డు చేస్తుంది. సమాజంలో వివిధ కోణాలను కథలు చర్చిస్తాయి.

2024లో వచ్చిన కథలను చదవడం ద్వారా 2034లో 2024 నాటి సామాజిక చలనాలను, సందర్భాలను, ఉద్వేగాలను తెలుసుకోగలం. అందువల్ల కథల్లో కాలం కనబడాలి. కాలాన్ని నమోదు చేసి చరిత్రకు పరికరంగా ఇవ్వాలి. వాస్తవ ప్రపంచాన్ని, అందులోని నిజానిజాలను చెప్పాలి. వర్తమాన తెలుగు కథ ఆ పనిని సమర్థవంతంగానే చేస్తుంది.

వర్తమాన తెలుగు కథలో సామాజికతను పరిశీలిస్తే అన్నం పెట్టే రైతు బాధలు, స్త్రీల కన్నీళ్లు, మానవ సంబంధాల్లో ఖాళీల మధ్య మొలుస్తున్న మైలురాళ్లు, గ్రామీణ విధ్వంసం, ప్రాంతీయ అసమానతలు, అణచివేతలు, అధికార దర్పాలు; ఫాసిస్టు రాజకీయాలు ... ఇవన్నీ తెలుగు కథలో ఉన్నాయి. అట్లాగే ఈ దశాబ్దంలో ఆంధ్రప్రదేశ్ రాజధాని సంగతి, ప్రపంచ అతిపెద్ద విపత్తు కరోనా కష్టకాలం వీటన్నింటినీ వర్తమాన తెలుగు కథ గమనించింది. ఆయా సమస్యలను పాఠకుల ముందు ఉంచింది.

కరోనా సమయంలో దేశంలో ఒక్కసారిగా ఊర్లు కంచెలు వేసుకున్నాయి. వేలాది మంది వలస కార్మికులు కాలినడకన వేల మైళ్ళు దూరం నడవాల్సి వచ్చింది. ఇట్లాంటి సందర్భం ఒకటి వస్తుందని మానవాళి ఊహించి ఉండదు. సైకిల్ మీద, రైల్వే ట్రాక్ల మీద ఊళ్లకు ఊళ్లు దాటారు. ఆకలిని, దాహాన్ని, భౌతిక దూరాన్ని భరించాల్సి వచ్చింది. ప్రతి మనిషి ఎదుటి వ్యక్తికి శత్రువు గానే కనిపించే కాలం. ఇట్లాంటి కాలంలోనూ కొంతమంది రోడ్లపై వాళ్లకు నీళ్ల ఇచ్చారు. ఒక ముద్ద అన్నం పెట్టారు. అదేపల్లి ప్రభు 'ఊరికే పోవాలి' కథలో ఆ కాలాన్ని చూపారు. ధర్మరాజు వెంట శునకం వలె మన వెనుక మరణము విడవకుండా వస్తున్నది అనే మాటతో కథ ప్రారంభం అవుతుంది. అఫ్సర్ రాసిన 'చూపుడువేలు' కథ మర్కజ్ వార్తల నేపథ్యంలో ఈ విపత్తుకు కారణం ఒక మతం అంటూ ఆ మతం వైపు చూపిన చూపుడు వేళ్ళను ప్రశ్నించింది. పాపినేని శివశంకర్ రచించిన 'గబ్బిలం' కథ ఒంటరితనంలోని జీవన భీతిని చిత్రీకరించింది. మహమ్మద్ ఖదీర్ బాబు 'వాసన' కథ



కరోనా నేపథ్యంలోంచి వచ్చిన కథ.

2019లో శ్రీ రమణ రచించిన 'నాలుగో ఎకరం' కథ 'దుక్కిటెద్దు కలలోకి రావడంతో...' అనే వాక్యంతో మొదలవుతుంది. మన పునాదులు ఏంటో పొలానికి ఉన్న ప్రాణం పోసే లక్షణాన్ని తీసేసి అదొక రియల్ ఎస్టేట్ వ్యాపార సరుగ్గా మారడం, ఆ తర్వాత పరిణామాలు గురించి రాసిన కథ. ఈ కథలో ఇప్పటి యువతరానికి వ్యవసాయం గురించి ఏమీ తెలియని అనేక విషయాలు చర్చకు వస్తాయి. రచయిత వాడిన పదజాలం మూలాలను గుర్తు చేస్తుంది. అంతర్లీనంగా భూమి రాజకీయం రావడం వ్యాపారం కావడం గురించి ఈ కథలో గుర్తించదగిన అంశం. 2019లో అధికారంలోకి వచ్చిన ఒక పార్టీ రాజధాని విషయంలో యూటర్న్ తీసుకుంది. అంతకు ముందున్న నాయకుడు ఒక ప్రాంతాన్ని రాజధానిగా ప్రకటించాడు. ఆ ప్రాంతాన్ని రాజధానిగా ప్రకటించాక అక్కడ ఉన్న మానవ సమూహాల్లో, ఆ మానవ సంబంధాల్లో అనుబంధాల్లో అనూహ్యమైన మార్పులు వచ్చాయి. ఎప్పుడూ దగ్గర కాని వాళ్ళు దగ్గరయ్యారు, దగ్గరగా ఉన్నవాళ్లు దూరం అయ్యారు. మరో నాయకుడు వచ్చాడు.. రాజధాని మూడు చోట్ల ఉంటుందన్నాడు. మళ్లీ చకచక మార్పులు ప్రారంభమయ్యాయి. రాజధాని ప్రాంతం ఎదుర్కొన్న ఆ పరిస్థితిని అత్యంత సమర్థవంతంగా ఎంవి రామి రెడ్డి 'త్రిశంకు నగరం' కథలో చెప్పారు. పాపినేని శివశంకర్ ఈ నేపథ్యంలోనే 'కొండచిలువ' కథ రాశారు.

అట్టాడ అప్పలనాయుడు రాసిన 'చిటికెన వేలు' కథ విప్లవోద్యమ నేపథ్యంతో ఉంటుంది. అభివృద్ధి పేరు మీద వ్యాపారం, రాజకీయం ఆసరాతో అడవిలోకి ఎలా ప్రవేశిస్తుందో అడవి, అడవి బిడ్డల ఉనికి ఎలా ప్రశ్నార్థకమవుతుందో చెప్తూ ... అక్కడే ఉద్యమం నడిపిన ఒక తరం ఎట్లా స్పందిస్తుందో ఈ కథ చెబుతుంది. ముగింపులో గిరిజన నాయకుడు చిటికెన వేలు కోసి, అధికారి టేబుల్ మీద పెట్టడం ద్వారా ఏం చెప్పదలుచుకున్నాడో అర్థం అవుతుంది. రచయిత చిటికెన వేలును ప్రతీకగా వాడుకున్నారు. ఈ రచయితే రాసిన మరో కథ 'శ్రేయోభిలాషి'. శత్రువు శ్రేయోభిలాషులను పోల్చుకోలేని సంక్లిష్ట సామాజిక సందర్భంలో ప్రజల్ని ఎవరు నడిపిస్తున్నారు? మార్కెట్ నడిపిస్తుందా? సంస్క ృతి నడిపిస్తుందా? రాజకీయాలా? ఇవన్నీ కలిపిన మిశ్రమమా? అంటూ శ్రేయోభిలాషి రూపంలోని శత్రువును చూపడానికి ఈ కథ రాసినట్టుగా అప్పలనాయుడు పేర్కొన్నారు. జి.వెంకటకృష్ణ రచించిన 'వేదవతి' కథలో కర్ణాటకలో పుట్టి రాయలసీమలో ప్రవేశించి తుంగభద్రలో కలిసే వేదవతిని నిలుపుకోగలిగితే సీమకు నీళ్లు అందుతాయని చెప్తూ, ఫ్లాష్ బ్యాక్లో జరిగిన ఒక ప్రేమ కథను అందులో దాగి ఉన్న మత, కుల వైషమ్యాలను చర్చిస్తాడు. వేదవతి రాయలసీమలోకి వస్తే ఎట్లాంటి పరిణామాలు ఉంటాయో పాఠకులకే వదిలేస్తాడు. కార్పొరేట్ కళాశాలలు కేవలం ర్యాంకులను పండించే కార్ఖానాలుగా మారిపోయాయి. డబ్బు సంపాదనే విద్యా లక్ష్యం అనే మార్గంలో అక్కడ విద్యార్థులు తర్ఫీదు చేయబడుతున్నారు. దీనిని నిరసిస్తూ ఎం.వి.రామిరెడ్డి రాసిన కథ 'కంకాళశాల'. విద్యార్థుల ఆత్మహత్యల నేపథ్యంలో రచయితలో కలిగిన ఒక కుదుపుకి ఈ కథ నిదర్శనం. అత్యంత విషాదకరమైన ఈ స్థితిని వ్యంగ్యంతో కథకుడు సమర్థంగా నడిపాడు.

నగర జీవితాన్ని ఆవిష్కరించిన కథలు ఈ మధ్యకాలంలో దేశరాజు విస్తృతంగా రాశారు. ఆయన 'షేమ్ షేమ్' పేరుతో రాసిన కథా సంపుటిలో ఇవి కనిపిస్తాయి. 'షేమ్ షేమ్ పప్పీ సేమ్' కథ ఒక దిగ్భ్రాంతికరమైన ముగింపుతో ముగుస్తుంది. విద్యాలయాల్లో ఆడపిల్లలకు మరుగుదొడ్లు సరిగ్గా లేని దుస్థితి గురించి చెప్తూనే అందులో ఒక యువతి తన వయసున్న యువతులంతా సామూహికంగా ఒక పెద్ద ఉద్యమంగా నగరంలో ఒకే సమయంలో అనేక ప్రదేశాల్లో తమ నిరసనని తిరుగులేని విధంగా తెలుపుతారు. అందుకు వారు మగవారి వలె గోడల మీద ఒకటికి వెళ్లడం కథలోని ఈ ముగింపు ఒక ఊహించని పరిణామం. కుప్పిలి పద్మ రచించిన 'మెట్రో కావాలా' కథలో వలస వెళ్లిన మంగా రమేష్ లాంటి గ్రామీణ ప్రాంత ప్రజలు పట్టణాలకు వలస వెళ్లినప్పుడు ఎదురయ్యే పరిస్థితులను సరికొత్తగా ఆవిష్కరించారు. స్త్రీలు ఎంతటి పోరాట పటిమ కలిగినవారో, వాళ్లు అనుకుంటే ఎంతటి కష్టతరమైన పనైనా చేయగలరని నిరూపించే రెండు కథలు ఈ కాలంలో వచ్చాయి. అవి కత్తి పద్మ 'పులస', ముని సురేష్ పిళ్లై 'గేణమ్మ' కథలు. భూమి మీద హక్కు ఆడవాళ్ళకి కూడా ఉండాలి అనే బలమైన లక్ష్యంతో ఒక మహిళ చేసిన వీరోచిత పోరాటం పులస. ఉత్తరాంధ్ర మాండలికంలో సాగిన ఈ కథ ఎంతోమంది మహిళలకు స్ఫూర్తివంతంగా నిలుస్తుంది. 'గేణమ్మ' కథలో ఆమె భర్త తాగుబోతు. వచ్చిన పెన్షన్ మొత్తాన్ని గ్లాసులో కలుపుకొని తాగేస్తాడు. ఆమె ఇంటిని ఈదాలి. అయితే ఇద్దరూ ముసలివాళ్లే. తనకి కూడా పెన్షన్ కావాలని సర్పంచిని కలుస్తుంది. ఒక రేషన్ కార్డుకి ఒకటే పెన్షన్ అని సర్పంచ్ చెబుతాడు. మంత్రిని కూడా కలుస్తుంది. ఆయన కూడా బిర్యాని తినేసి పొమ్మని, కావాలంటే ఆరోగ్యశ్రీ ఇద్దరికి ఇస్తామని, పెన్షన్ అలా కుదరదని చెప్తాడు. విలవిలలాడిపోయిన గేణమ్మ ఒక వకీలు సహాయంతో యెట్లా గట్టు ఎక్కిందో చెప్పడం ఇందులోని కథ. ప్రభుత్వాలు సంక్షేమ కార్యక్రమాల అమలులో తీసుకునే నిర్ణయాలు బడుగు బలహీన వర్గాల జీవితాన్ని ఎట్లా ప్రభావితం చేస్తాయో ఈ కథలో రచయిత చర్చించాడు.

పలమనేరు బాలాజీ రచించిన 'ఒక సాయంత్రం త్వరగా ఇల్లు చేరినప్పుడు...' కథ సంపుటిలోని కథలన్నీ ఆమె చుట్టూ తిరుగుతాయి. ఇంటి చాకిరీలో ఉండే మూలాలను, శ్రమ జీవితం తాలూకు కనిపించని కోణాలను చిత్రీకరించాడు. ఇటీవల ఈ రచయితే వెలువరించిన 'ఏకలవ్య కాలనీ ఎరుకల గాథలు' ఎరుకల వారి జీవితాలను మన ముందుకి తెచ్చాడు. తెలంగాణ ప్రాంతం నుంచి రమేష్ కార్తీక్ నాయక్ 'ఢావ్లో' కథాసంపుటిలో లంబాడి వారి జీవితాన్ని చిత్రించాడు. కొట్టం రామకృష్ణారెడ్డి రచించిన తాతిల్, ఇగురం గల్లోడు, చల్లని మోహం లాంటి కథల్లో మానవ సంబంధాల గురించి ఆరాటం కనిపిస్తుంది. స్ఫూర్తి కంది వనం 'ముసురు' కథ కల్లుగీత కార్మికుల తరాల మధ్య వ్యథని చెప్తుంది. పి.చిన్నయ్య 'ముత్తమ్మ మరియమ్మ సమాధి' క్రైస్తవ మతంలో కూడా తక్కువ కులస్తులకు జరిగే అవమానాల గురించి చెప్పిన కథ. దేశరాజు రచించిన 'ఆలీబాబా అనేక దొంగలు' కథలో దేశంలో మత విద్వేషాలను అధికారంలో ఉన్న నాయకత్వాలు పురిగొల్పడాన్ని గుర్తించాలని అంటాడు. ఆలీబాబా ఎవరో మనల్ని కనుక్కోమని ఒక పజిల్ మనం ముందు ఉంచుతాడు. అలాగే వేంపల్లి షరీఫ్ చారల పిల్లి, సైకిల్ చక్రాలు, బాబయ్య స్వామి దర్గా మతసామరస్యంపై వచ్చిన మంచి కథలు.

వ్యాసం నిడివి దృష్ట్యా కొన్ని కథలను మాత్రమే ఉదహరించడం జరిగింది. ఇంకా అనేకమంది కథకులు రాసిన కథలు ఈ కాలాన్ని చరిత్రకు అందించాయి. ఇట్లా వర్తమాన తెలుగు కథ అనేక అంశాలను, సమాజంలోని భిన్న కోణాలను ఆవిష్కరిస్తున్నప్పటికీ ఇంకా కథకులు సమాజంలో చూడాల్సిన అంశాలు ఉన్నాయి. విద్యా, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో వ్యాపారం ప్రవేశించింది. చిత్ర విచిత్రమైన మార్పులు సమాజంలో మానవ మనస్తత్వాల్లో చోటు చేసుకుంటూ ఉన్నాయి. మత రాజ్య ప్రస్తావన వినిపిస్తూ ఉంది. తెలుగు కథకుడు ఇంకా అప్రమత్తంగా ఉండాల్సిన కాలంగా మనం దీన్ని గుర్తించాలి.

– డాక్టర్ సుంకర గోపాలయ్య
94926 38547

ఈతకోట సుబ్బారావుకు రాణీ పులోమజాదేవి కథా పురస్కారం

తెలుగు సాహితీవనం, రాణీ పులోమజాదేవి ఫౌండేషన్ సంయుక్తంగా ఇస్తున్న రాణీ పులోమజాదేవి కథాపురస్కారాన్ని 2025 సంవత్సరానికి గానూ ప్రముఖ కవి, రచయిత ఈతకోట సుబ్బారావు రచించిన కథాసంకలనం 'పోడుగాలి'కి ప్రదానం చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. తల్లి వేరు – నెల్లుట్ల రమాదేవి, బల్కావ్ – శ్రీఊహ కథాసంపుటాలు గౌరవ సన్మానానికి ఎంపికయ్యాయి. ఈ పోటీకి 75 కథా సంపుటాలు వచ్చాయి. న్యాయనిర్ణేతలుగా డా. విహారి, డాక్టర్ అయోధ్యా రెడ్డి వ్యవహరించారు. ఈ పురస్కారాన్ని తన తల్లి, సినీ గీత రచయిత కీ.శే. డా.రాణీ పులోమజాదేవి పేరిట సంగీత దర్శకులు ప్రద్యోధన్ అందిస్తున్నారు. తెలుగు సాహితీవనం జులైలో నిర్వహించే 8వ వార్షికోత్సవం సభలో ఈ పురస్కార సన్మానాలు ఉంటాయని నిర్వాహకులు శాంతికృష్ణ తెలిపారు.

బి.ప్రసాదమూర్తికి చిన్ని నారాయణరావు సాహితీ అవార్డు

చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా సాహిత్యంలో విశేష కృషి చేసిన సాహితీవేత్తలకు అవార్డులను ప్రకటించింది. అసాధారణ వాక్య నిర్మాణం, నిత్యనూతన శైలీ చాతుర్యంతో ఇప్పటికి 14 పుస్తకాలను అందించిన సుప్రసిద్ధ కవి, రచయిత బి.ప్రసాదమూర్తికి ప్రధాన అవార్డును అందజేయబోతుంది ఫౌండేషన్. ఈ అవార్డుకు రూ.10 వేల నగదుతో సత్కారం వుంటుంది. ఈ అవార్డుతో పాటు కీ.శే. సత్యవేటి శ్రీకాంత్, తుంగా రాజగోపాల్ రెడ్డి, నాగభైరవ కోటేశ్వరరావు స్మారక సాహితీ పురస్కారాలను చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ అందజేస్తుంది. ఈ మూడు అవార్డులకు పి.శ్రీనివాస్ గౌడ్, కొమ్మవరపు విల్సన్ రావు, అవధానుల మణిబాబులను ఎంపిక చేసింది. వీరికి రూ.2,500ల నగదుతో సత్కారం వుంటుంది. ఏప్రిల్లో నెల్లూరులో జరిగే ఫౌండేషన్ ద్వితీయ వార్షికోత్సవ వేడుకల్లో ఈ అవార్డుల ప్రదానం జరుగుతుంది.

– చిన్ని నారాయణరావు,
94402 02942

ఆదర్శనేత ఉద్దరాజు రామం

యువకుడిగా స్వాతంత్ర్యోద్యమంలో అడుగుపెట్టి కమ్యూనిస్టుగా పరిణామం చెంది రాజకీయాలకే వన్నెతెచ్చిన ఆదర్శనేత ఉద్దరాజు రామం. పశ్చిమ గోదావరి జిల్లాలో కాళీపట్నం జమిందారీకి వ్యతిరేకంగా రైతులను సమీకరించి, తిరుగుబాటు చేసి జమిందారీ వ్యవస్థ రద్దుకు శ్రీకారం చుట్టారు. నవయవ్వనంలోనే కఠిన నిర్బంధాలను ఎదుర్కొని సమరశీలంగా పోరాటాలు సాగించిన యోధుడాయన. సుందరయ్యతో పరిచయం ఆయన జీవితాన్నే మలుపు తిప్పింది. జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత. జిల్లాలో ఏర్పడిన మొదటి కమ్యూనిస్టు పార్టీ శాఖ సభ్యుడు. మిగతా వారు తరువాత తప్పుకున్నా తుదిశ్వాస వరకు ఆయన పార్టీలో కొనసాగారు. ఆయన జిల్లాస్థాయి నుంచి అఖిల భారత కిసాన్సభ అధ్యక్షుడి వరకు అనేక బాధ్యతలు జయప్రదంగా నిర్వహించారు. నమ్మిన ఆశయాలను జీవన విధానంగా మల్చుకొని త్రికరణశుద్ధిగా అమలుచేసిన అసాధారణ వ్యక్తిత్వం ఆయనది. జీవితంలో ఎదురైన ఆటుపోట్లు, పరీక్షలను ఎదుర్కొని కమ్యూనిస్టుగా 100 శాతం మార్కులు సాధించిన ఘనత ఆయనది.



ఆయన మాటల మనిషి కాదు; చేతల మనిషి. ఏ పనినైనా చేసి చూపించే మనస్తత్వం. ఆయనలోని ఈ సద్గుణమే యువతరానికి స్ఫూర్తినిచ్చింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అనేకమంది కమ్యూనిస్టు యోధులను తయారుచేసి ఎర్రజెండాను సమున్నతంగా నిలిపారు. అతివాద, మితవాద చీలికల అనంతరం జిల్లాలో బలహీనపడ్డ సిపిఐఎంలోకి కొత్తతరం నాయకత్వాన్ని చైతన్యపూర్వకంగా తీసుకువచ్చి అభివృద్ధి చేసి వారికి ఎర్రజెండాను అప్పగించారు. ఆయన సంపాదించుకున్న ఆస్తి కమ్యూనిస్టు ఆదర్శం. దానినే వారసత్వంగా తన తరువాతి తరాలకు అందించారు.

కామ్రేడ్ ఉద్దరాజు రామం గారితో నా తొలి పరిచయం విజయవాడ మార్క్సిస్టు కార్యాలయంలో జరిగింది. 1984లో రాష్ట్ర యువజన రంగం బాధ్యతల్లోకి మారి నెల్లూరు నుంచి విజయవాడ వచ్చాను. అప్పటివరకు రామం గారి పేరు వినడం తప్ప ప్రత్యక్షంగా తెలియదు. మార్క్సిస్టు కార్యాలయంలో ఆయన్ను తొలిసారి చూసినప్పుడు ఆయన నిరాడంబరత, మాటతీరు, మర్యాదతో కూడిన పలకరింపు నన్ను ఆశ్చర్యానికి గురిచేశాయి. గాంధీ మహాత్ముడు ఎలా ఉంటారో మన తరానికి తెలియదు. కానీ రామం గారిని చూసినప్పుడు గాంధీగారిని చూసినట్టే ఉంటుంది. రైతు సమస్యలపై ఆయనకున్న అవగాహన అపారం. ఆయనతో మాట్లాడిన సందర్భాల్లో వచ్చిన పరిజ్ఞానం ఆ తరువాత నేను రైతు సంఘ బాధ్యతల్లోకి మారినప్పుడు ఉపయోగపడింది. ముఖ్యంగా గోదావరి డెల్టాలో ఉండే నిర్దిష్టమైన సమస్యలు ఆయనకు చాలా లోతుగా తెలుసు. పార్లమెంటు సభ్యుడిగా హిందీలో ఆయన చేసిన ప్రసంగం నెహ్రూ లాంటి వారిని సైతం ఆకర్షించింది.

పశ్చిమ గోదావరి జిల్లాలో యువ నాయకత్వం అభివృద్ధికోసం ఆయన తపించేవారు. యువజన, విద్యార్థి రంగాల ద్వారా వచ్చిన క్యాడర్పై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆయన దృష్టిలో అభివృద్ధి కాగలరనుకున్న కార్యకర్తల గురించి అప్పుడప్పుడు నాతో కూడా ప్రస్తావించేవారు. నాకున్న అభిప్రాయాలను కూడా ఆయనతో పంచుకునేవాడిని. ఈనాడు పార్టీలో నాయకత్వ స్థానాల్లో ఉన్న కామ్రేడ్ మంతెన సీతారాం, బి.బలరాం లాంటి నాయకులకు ఉద్యమ పునాది వేసిన వారు రామం గారు.. ఆ తరువాత కా॥ అల్లూరి, ఆర్ఎస్ లాంటి వారు వారిని ప్రోత్సహించి వివిధ బాధ్యతల్లో పెట్టారు.

ఆయన జీవిత చరమాంకంలో జ్ఞాపకశక్తిని కోల్పోయినప్పటికీ ఆయన నోటివెంట ఎప్పుడూ పార్టీ, ఉద్యమాలు, కార్యకర్తలు అంటూ వస్తుండేవి. కొందరు గుర్తు రాకపోయినా గుర్తుకు తెచ్చుకునేందుకు తీవ్ర ప్రయత్నం చేసేవారు. ఒక జూనియర్ కామ్రేడ్గా ఆయనతో గడిపిన ఆ కొద్దిపాటి సాహచర్యం ఎప్పటికీ గుర్తుండిపోయే స్ఫూర్తిదాయకమైన జ్ఞాపకం. ఈ సందర్భంగా కా॥ మాణిక్యాంబ గారి గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఆమె రామం గారి సతీమణిగానే కాదు; పార్టీ కామ్రేడ్స్ను ఒక తల్లిలాగా ఆదరించేవారు. వీరనారి కూడా. పోరాటాల్లో పాల్గొని నిర్బంధాన్ని ఎదుర్కొన్నారు. కుల సాంప్రదాయ కట్టుబాట్లను ధిక్కరించి ఘోషా పద్ధతికి స్వస్తి చెప్పి సామాన్య మహిళలతో కలిసిపోయిన ఆదర్శ మహిళ. ఎప్పుడూ పార్టీ పాటలు, జాతీయోద్యమ గీతాలు ఆలపిస్తుండేవారు. ఆమెతో కొద్ది క్షణాలు గడిపినా నిరుత్సాహంతో వెనకడుగు వేసేవారు కూడా ఉత్సాహం తెచ్చుకొని చురుగ్గా కదులుతారు. అలాంటి వ్యక్తిత్వం ఆమెది. ఆమెను అలా తీర్చిదిద్దిన ఘనత కూడా రామం గారిదే. వారిరువురూ ఆదర్శ దంపతులే కాదు. ఆదర్శ కమ్యూనిస్టులు కూడా. తమ కుటుంబాలను కూడా అలాగే తీర్చిదిద్దారు. ఆయన మరణానంతరం రామం గారి జ్ఞాపకార్థం రైతుసంఘం ఆధ్వర్యంలో కామ్రేడ్ అల్లూరు సత్యనారాయణ చైర్మన్గా, నేను కార్యదర్శిగా ట్రస్టు ఏర్పాటు చేసి వ్యవసాయ సమస్యలపై అధ్యయనం, పుస్తకాల ముద్రణ, స్మారక ఉపన్యాసాల నిర్వహణ వంటివి చేస్తుండేవాళ్ళం. ఆ ట్రస్టు బాధ్యులు మారినా ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది.

కామ్రేడ్ రామం గారి జీవితం, పోరాట అనుభవాలను ఈ పుస్తక రూపంలో తీసుకువస్తున్నందుకు వారి కుమారులు బాపిరాజు గారిని, సహకరించిన యు.రామకృష్ణ, దండమూడి భానుప్రసాద్ గారిని అభినందిస్తున్నాను. కొత్త తరానికి రామం గారి జీవిత చరిత్ర స్ఫూర్తినిస్తుందనడంలో సందేహం లేదు.

('ఉద్యమాల శిఖరం ఉద్దంరాజు రామం' పుస్తకానికి ముందుమాట)


– వి.శ్రీనివాసరావు
సిపిఎం రాష్ట్ర కార్యదర్శి

కదిలించే కథల పొత్తం 'ఆనంద తాండవం'

ఆచార్య డా.కె.జి.వేణు. ఒక వైపు నాటికలు, నాటకాలు, కవితలు, విశ్లేషణలు, ఇతర సాహిత్యాంశాలు రచిస్తూనే తన సృజనాత్మకతతో పాతికకు పైగా కథలు రాశారు. అందులోని దాదాపు మూడొంతులు వివిధ పోటీల్లో ఏదో ఒక బహుమతిని గెల్చుకున్నవి కావడం విశేషం, అయితే కవిగా అతని శైలి, భాషలో కన్పించే తీవ్రత, ఆవేశం కథలలో ఎక్కడా కనిపించనీయకుండా, అంతా సానుకూల, సామరస్య సందేశాత్మక శైలిలో కథలు రాయడం విశేషం. ఆయన రాసిన కథల్లో బహుమతులు పొందిన వాటితో కలిపి, ఇరవై కథలతో 'ఆనందతాండవం' పేరుతో, ఇటీవలే ఓ కథా సంపుటి విడుదలైంది. తొలి కథ 'ఆనందతాండవం' చదివిన ప్రతి పాఠకుడు... పతాక సన్నివేశంతో అదంతా తమ కుటుంబంలోనే జరిగినంతగా ఆనందతాండవానికి లోనవుతారు. తల్లిదండ్రుల మాటలను శ్రావణి లెక్కచేయక, తొందరపాటుతో, పెద్ద ఆపదలో చిక్కకోవలసిన తన వైవాహిక జీవితాన్ని, తన కళ్ళ ముందు జరిగిన సంఘటనతో, వివేచనాత్మక నిర్ణయం తీసుకున్న తీరు ఎందరికో ఆదర్శప్రాయంగా నిలుస్తోంది.

అలాగే పిల్లల ఇష్టాయిష్టాలు, అభిరుచులతో సంబంధం లేకుండా, అంతా తన అదుపాజ్ఞలలో తన 'కోరుకున్నట్లుగానే తన కొడుకును చదివించాలనుకుంటాడు శివన్నారాయణ. కానీ తన కొడుకు బాల్యంలో మాననీయ కోణంలో వ్యవహరించిన తీరుతో, తండ్రిగా తాను కూడా మారిన తీరు... ఈనాడు మన సమాజానికి ఒక హెచ్చరిక, ఒక సూచన ... ఒక మహత్తర సందేశంగా మలిచారు రచయిత 'నాన్నా! నన్నిలా పెంచండి' కథలో. ఇక 'చేదు చెరుకులు' కథలో, తాను రైతుబిడ్డగా సాటిరైతు కష్టం పట్ల, ఆ ఉద్యోగి, సంస్కారవంతుడుగా, మానవతా దృక్పథంతో ప్రవర్తించిన విధానం, ప్రతి రైతు పక్షపాతికీ హృదయం ద్రవించేలా చేస్తుంది

'రాజయ్య దేవుడయ్యాడు' కథ.. నిజానికి ఈ కథ బీహార్ రాష్ట్రంలో ఒక సామాన్యుడు సాహసోపేతంగా చేసిన కార్యక్రమం. ఒక బక్కరైతు, తమ గ్రామాన్ని, బయటి ప్రపంచానికి దూరం చేస్తున్న ఒక కొండను ఒక్కడే సంవత్సరాల తరబడి తవ్వి ఒక మార్గం ఏర్పాటు చేస్తాడు. నిరంతర అధ్యయనశీలి అయిన డా. వేణు ఆ సంఘటనను గొప్ప కథగా మలచి, పాఠకుల మన్ననలు పొందారు. ఇటీవల ప్రజలను శాస్త్రీయ దృక్పథం కలిగిన ఎందరినో ప్రభావితం చేస్తున్న అవయవదానం, దేహదానం వంటి మానవీయ నిర్ణయాలను, మంచి కథగా మలిచిన కథ 'మహాదాత'. సన్నిహితుల సంకుచితత్వాన్ని, స్వార్థపూరిత మనస్తత్వాలను ప్రతిబింబిస్తుంది ఈ కథ. కానీ అంతిమంగా, ఉపాధ్యాయుడు చెల్లూరి శ్రీనివాసరావు, తన అంతిమ సంస్కారానికి బదులు, అతను ఎంతో దార్శనికతతో తీసుకున్న దేహదాన నిర్ణయం ప్రకటించిన, శ్రీనివాసరావు భార్య జానకమ్మ ప్రకటన, కథలోని మిగిలిన పాత్రలనే కాదు... చదువుతున్న పాఠకుల్ని సైతం విస్మయపరుస్తుంది. తాత్కాలిక ప్రయోజనాన్ని గురించి ఆలోచించే వారి చెంప చెళ్ళుమనిపిస్తుంది.




మరో మంచి సందేశాత్మక కథ 'ఆ బిడ్డ నాకు కావాలి'. కథ పేరునుబట్టి, చివరి వరకు పాఠకుల్ని ఉత్కంఠలో ముంచెత్తుంది ఈ కథ పతాక సన్నివేశంలో సుమతి తీసుకున్న నిర్ణయం ఎన్నో హృదయాలను ద్రవింపజేస్తుంది. సుమతి తల్లిదండ్రులే కాదు, పాఠకులు కూడా ఆమె విశాల హృదయానికి నమోవాకాలర్పించవలసిందే. ఈ కథతో పోటీపడే కథ 'మా తల్లి బంగారం!'. 'వివాహబంధం తెగిపోయిన' సునంద 'తన భవిష్యత్ కంటే, దుర్మార్గుడైన భర్త (మాజీ) తల్లి దండ్రులను ఆదరించి అక్కున చేర్చుకున్న తీరు అపూర్వం. ఊహించని మలుపులతో, రచయిత డా. వేణు కథను నడిపించారు. క్లైమాక్స్తో పాఠకుడి కళ్ళు చెమర్చేలా చేశారు.

భారతీయ కుటుంబ వ్యవస్థలో బంధువులు, ఆత్మీయులు, శ్రేయోభిలాషులు ఎందరున్నా, ప్రథమస్థానం స్వంత కుటుంబ సభ్యులదే! పెరిగిన సాంకేతిక విద్యా పరిజ్ఞానంతో పిల్లలు విదేశాలలో స్థిరపడిపోతున్నారు. వారికి మనసున్నా, తరచూ స్వదేశానికి వచ్చి, తల్లిదండ్రులను చూడడం, చాలా వ్యయప్రయాసలతో కూడుకున్న వ్యవహారమై పోయింది. అందువల్ల వేలాదిమంది వృద్ధ తల్లిదండ్రులు ఒంటరి జీవితం లాంటిదే గడుపుతున్నారు. ఆ జంటలో ఒకరు మరణించి, మిగిలిన ఒక్కరే స్వదేశంలో ఒంటరిగా వుండవలసి వస్తే... ఆ పరిస్థితి దారుణం. అలాంటి జీవితాల్లో భర్తను కోల్పోయిన, ఒక భార్య, తల్లిగా తన పిల్లల ఆస్తికి సంరక్షరాలిగా వుంటూ, సరైన మానవ సంబంధాలు లేక, పడుతున్న వేదనను కొత్త కోణంలో ఆవిష్కరించిన కథ... 'అవును నేను గయ్యారానే...'. పాఠకులకు, ముఖ్యంగా ఆ వయసు తల్లిదండ్రులకు కన్నీళ్ళు రప్పిస్తోంది ఈ కథ. మిగిలిన కథలు కూడా ఆసక్తికరంగా పాఠకుల అభిమానాన్ని చూరగొంటాయి. ఊపిరి సలపని సాహితీ, సాంస్కృతిక రంగ సైనికులు డా. కె.జి. వేణు గారి కలం నుండి, మరిన్ని మంచి కథలు రావాలని, తెలుగు పాఠకలోకం ఎదురుచూస్తూ వుంటుంది. రూ.200 వెల ఉన్న ఈ పుస్తకం ప్రతులకోసం కలిమిశ్రీ – 92464 15150ని సంప్రదించొచ్చు.

– బి.వి. అప్పారావు
93470 39294

డీలిమిటేషన్‌పై జమ్మూకాశ్మీర్ చెప్తున్న పాఠాలు

- జనాభాతో సంబంధం లేకుండానే ఇక్కడ 'పునర్విభజన'
- హిందూ-మెజారిటీ జమ్మూకు లాభం
- ముస్లిం-మెజారిటీ కాశ్మీర్‌కు కోత



న్యూఢిల్లీ : డీలిమిటేషన్‌పై దేశంలో తీవ్ర చర్చ నడుస్తున్నది. అనేక రాష్ట్రాలు ఈ ప్రతిపాదనపై వ్యతిరేకతను తెలుపుతున్నాయి. కేంద్రంలోని మోడీ సర్కారుపై ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నాయి. కాంగ్రెస్, ఇతర బిజెపియేతర పార్టీ పాలిత రాష్ట్రాల్లో అక్కడి స్థానిక ప్రభుత్వాలు దీనిపై ఏదో విధంగా తమ నిరసన గళాన్ని వినిపిస్తున్నాయి. తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇప్పటికే దీనిపై గట్టిగా స్పందించారు. ఈ నెల 22న డీలిమిటేషన్‌పై తమిళనాడు సిఎం స్టాలిన్ ఒక సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో డీలిమిటేషన్ అంశంపై చర్చ నడుస్తోంది.

జనాభా ఆధారంగా దేశంలో నియోజకవర్గాల పునర్విభజన జరిగే ప్రక్రియపై పలు రాష్ట్రాలు భయాందోళనలను వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా, దక్షిణాది రాష్ట్రాల నుంచి ఈ నిరసన గళం బలంగా వినిపిస్తున్నది. ఎందుకంటే, దేశంలో ఏ ఇతర రాష్ట్రాలతో పోల్చినా.. దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను ప్రభావవంతంగా నిర్వహించాయి. దీంతో ఇక్కడ జనాభా పెరుగుదల రేటు తగ్గిపోయింది. అదే సమయంలో ఉత్తరాది రాష్ట్రాల్లో మాత్రం పెరుగుదల నమోదైంది. ఇలాంటి తరుణంలో జనాభా ఆధారంగా డీలిమిటేషన్‌ను జరిపితే తమ రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య తగ్గిపోయి, రాజకీయంగా చట్టసభల్లో తమ ప్రాధాన్యత తగ్గిపోతుందనే వాదనను దక్షిణాది రాష్ట్రాలు వినిపిస్తున్నాయి.

ఇలాంటి తరుణంలో జమ్మూకాశ్మీర్‌లో జరిగిన డీలిమిటేషన్ ప్రక్రియను విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. ఇక్కడ జనాభా అనే అంశంతో సంబంధం లేకుండా హిందూ మెజారిటీ ప్రాంతమైన జమ్మూకు రాజకీయంగా మరింత ప్రాధాన్యత దక్కే విధంగా మోడీ సర్కారు చేసిందని చెబుతున్నారు.

జమ్మూకు ఇలా..

జమ్మూకాశ్మీర్ డీలిమిటేషన్ తుది ఉత్తర్వు 2022 ప్రకారం.. జమ్మూకాశ్మీర్ మొత్తం జనాభా 2011 జనాభా లెక్కల ప్రకారం 1.22 కోట్లు. ఇందులో 53.5 లక్షల మంది జనాభాను కలిగి ఉన్న జమ్మూ ప్రావిన్స్‌కు ఆరు సీట్లు అదనంగా వచ్చి చేరాయి. దీంతో అసెంబ్లీ స్థానాల సంఖ్య 37 నుంచి 43కు పెరిగింది. జమ్మూ జనాభా వాటా 43 శాతం కాగా.. ఆ ప్రాంతం కలిగి ఉన్న సీట్లు మాత్రం 47 శాతం కావటం గమనార్హం.

కాశ్మీర్‌కు మాత్రం ఒక్క సీటే

ఇక ముస్లింలు అధికంగా ఉండే లోయ ప్రాంతం కాశ్మీర్‌కు అదనంగా ఒక్క సీటు మాత్రమే వచ్చి చేరింది. దీంతో లోయ ప్రాంత సీట్ల సంఖ్య 47కు చేరింది. 68.88 లక్షల మంది (56 శాతం) జనాభాను కలిగి ఉన్న కాశ్మీర్‌కు దక్కిన సీట్లు 52 శాతం. గత దశాబ్దంతో పోలిస్తే ఈ రెండు ప్రాంతాలలో జనాభావృద్ధి జాతీయ సగటు కంటే చాలా తక్కువగా ఉన్నది.

అనంతనాగ్ సీట్ల కేటాయింపు

డీలిమిటేషన్ ప్రక్రియలో భాగంగా కొత్తగా ఏర్పాటు చేసిన ఏడు నియోజకవర్గాలను రెండు ప్రాంతాలకు అసమానంగా పంచారు. జమ్మూకు ఆరు, కాశ్మీర్‌కు ఒక నియోజకవర్గాలను కేటాయించటం గమనార్హం. అంటే, ఇక్కడ దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్న 'జనాభా ఆధారిత డీలిమిటేషన్'కు విరుద్ధంగా జమ్మూకాశ్మీర్‌లో నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. అయినప్పటికీ, అది చాలా లోపభూయిష్టంగా ఉన్నది. వాస్తవానికి జమ్మూలో బిజెపి పట్టు ఉన్నది. ముస్లింలు అధికంగా ఉండే కాశ్మీర్‌లో ఆ పార్టీకి బలం శూన్యం. దీంతో జమ్మూలో సీట్ల సంఖ్యను పెంచుకోవటం ద్వారా తన రాజకీయ బలాన్ని కాపాడుకోవాలనే స్వలాభంతోనే కేంద్రంలోని మోడీ సర్కారు ఈ ప్రక్రియను తనకు అనుకూలంగా మార్చుకున్నదని రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు.

ప్రాంతం, సరిహద్దుకు ప్రాధాన్యత

భౌగోళిక కాంపాక్ట్‌నెస్, భౌతిక లక్షణాలు, పరిపాలనా యూనిట్ల సరిహద్దులు, కమ్యూనికేషన్ మరియు ప్రజా సౌలభ్యం వంటివి డీలిమిటేషన్‌లో అంశాలుగా ఉన్నాయి. డీలిమిటేషన్ కమిషన్ జనాభా కంటే ఎక్కువగా ప్రాంతం, 'సరిహద్దు ప్రాంతం'పై ఆధారపడింది. అయితే, ఇవి కూడా సెలెక్టివ్‌గా ఉండటం గమనార్హం. ఎందుకంటే, ముస్లిం మెజారిటీ నియోజకవర్గాల సగటు పరిమాణాన్ని పెద్దగా ఉంచి, హిందూ మెజారిటీ నియోజకవర్గాల సంఖ్యను పెంచారు. ఇక నియంత్రణ రేఖ (ఎల్‌ఓసి) వెంట ఉన్న నియోజకవర్గాలను విస్తరించారు. డీలిమిటేషన్ ముందు కాశ్మీర్ ప్రావిన్స్ బారాముల్లా, శ్రీనగర్, అనంతనాగ్ అనే మూడు పార్లమెంటరీ నియోజకవర్గాలను కలిగి ఉండేది. జమ్మూకు జమ్మూ, ఉధంపూర్ అనే రెండు స్థానాలుండేవి. అయితే, అనంతనాగ్‌ను విభజించి, అందులో ఒక భాగాన్ని శ్రీనగర్‌కు, మరొక భాగాన్ని జమ్మూ ప్రావిన్స్‌లోని రాజౌరికి జోడించారు. దీంతో అనంత్‌నాగ్‌లోని ముస్లిం ప్రాతినిధ్యాన్ని తగ్గించారు. అనంత్‌నాగ్-రాజౌరీ పార్లమెంటరీ నియోజకవర్గ ఏర్పాటు ఆందోళనకరమన్న వాదనలు తీవ్రంగా ఉన్నాయి. ఎందుకంటే.. భౌగోళికంగా, సాంస్కృతికంగా ఇవి రెండు వేర్వేరు ప్రాంతాలు కావటమే.

అయితే, చట్టసభలో కాశ్మీర్ రాజకీయ ప్రాధాన్యతను తగ్గించి, ఆ ప్రాంత సంస్కృతిపై దెబ్బ కొట్టాలన్న ప్రయత్నమే డీలిమిటేషన్ కసరత్తని, డీలిమిటేషన్ కమిషన్ బిజెపికి రబ్బరు స్టాంప్‌గా మారిందని జమ్మూలో కూడా పలు ప్రతిపక్ష పార్టీలు ఆరోపించాయి. కాగా, డీలిమిటేషన్ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికలో బిజెపిన ఎమ్మెల్యే సభ్యుల సంఖ్యా బలాన్ని 25 నుంచి 29కి పెంచుకున్న విషయం విదితమే.

కేదార్‌నాథ్ నుంచి హిందూయేతరులను బహిష్కరించాలి

- బిజెపి ఎమ్మెల్యే ఆశా నౌటియాల్ వివాదాస్పద వ్యాఖ్యలు

డెహ్రాడూన్ : కేదార్‌నాథ్ ప్రాంతం నుంచి హిందూ యేతరులను బహిష్కరించాలంటూ ఉత్తరాఖండ్‌లోని బిజెపి ఎమ్మెల్యే ఆశా నౌటియాల్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అక్కడ నివసిస్తున్న హిందూ యేతరులు మాంసం, మద్యం విక్రయిస్తూ స్థానికుల మనోభావాలను గాయపరిచే చర్యలకు పాల్పడుతున్నారని ఆమె ఆరోపించారు. ఇలా చేయడం హిందువుల మత విశ్వాసాలను దెబ్బతీయడమే అవుతుందని కేదార్‌నాథ్ శాసనసభ్యురాలైన నౌటియాల్ చెప్పారు. ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ 'నేను ఇక్కడి స్థానికులతో ఓ సమావేశాన్ని నిర్వహించాను. హిందూ యేతరులు మతపరమైన మనోభావాలను గాయపరుస్తున్నారని వారు చెప్పారు. ప్రపంచంలోని నలుమూలల నుండి భక్తులు ఇక్కడికి వచ్చి బాబా కేదార్‌ను ప్రార్థిస్తారు. కాబట్టి వారిని (హిందూ యేతరులు) ఇక్కడికి వెళ్లకుండా నిషేధించాలి. వారి చర్యలను స్థానిక వ్యాపారులు కూడా నిరసిస్తున్నారు' అని అన్నారు.

కాగా నౌటియాల్ ప్రకటనపై కాంగ్రెస్ మండిపడింది. రాజకీయ లబ్ధి కోసం ఒక ఎమ్మెల్యే ఇలా మాట్లాడడం దురదృష్టకరమని పిసిసి అధ్యక్షుడు కరణ్ మహరా వ్యాఖ్యానించారు. ఒకరి మతం ఆధారంగా తప్పు, ఒప్పులు నిర్ణయించలేరని ఆయన అన్నారు. రాజ్యాంగాన్ని అనుసరించి ఎమ్మెల్యేగా ఆమె ప్రమాణం చేశారని గుర్తు చేశారు. మన దేశంలో చట్టం ముందు అందరూ సమానులేనని చెప్పారు. అలాంటప్పుడు మైనారిటీలనే ఎందుకు లక్ష్యంగా చేసుకోవాలని ప్రశ్నించారు.

లడఖ్‌లో 1,275 గెజిటెడ్ పోస్టులు ఖాళీ

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ శాఖల్లోనూ..కేంద్ర పాలిత ప్రాంతాల్లోనూ ఉద్యోగాలు భర్తీకి నోచుకోవటంలేదు. ఇందుకు ఉదాహరణే లడఖ్. లడఖ్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించిన ఆరేళ్లయినా ఇక్కడ 1,275 గెజిటెడ్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. లడఖ్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చినప్పటి నుంచి ఈ పోస్టులను భర్తీ చేయలేదని కేంద్రం పార్లమెంటరీ ప్యానెల్‌కు తెలిపింది.వివిధ విభాగాల్లో మొత్తం 3,596 నాన్-గెజిటెడ్ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మార్చి 10న సమర్పించిన నివేదికలో డిపార్ట్‌మెంట్-సంబంధిత పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ హోం వ్యవహారాలకు తెలిపింది.3,172 పోస్టులకు నియామకాలు స్టాఫ్ సెలక్షన్ కమిషన్, అటానమస్ హిల్ డెవలప్‌మెంట్ సబార్డినేట్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్, లేహ్ , కార్గిల్, లడఖ్ పోలీస్ బోర్డు, ఇతర విభాగాల ద్వారా జరిగాయని పేర్కొంది. దీనితో పాటు.. లడఖ్‌లో శాసనసభ లేకపోవడంతో ఇక్కడ ప్రజల్లో భూమి, వనరులు, జీవనోపాధి గురించి అభద్రతాభావం పెరిగింది . ఈ ప్రాంతం యొక్క సాంస్కృతిక గుర్తింపు, పర్యావరణ వ్యవస్థ ప్రమాదంలో పడుతుందనే భయాలు రేకెత్తించాయి.

నేడు సుప్రీంకోర్టు జడ్జిగా జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ ప్రమాణస్వీకారం

న్యూఢిల్లీ : కోల్‌కతా హైకోర్టు జడ్జి జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ సుప్రీంకోర్టు జడ్జిగా బాధ్యతలు చేపట్టనున్నారు. సుప్రీంకోర్టుగా జడ్జిగా బాగ్చీ చేత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. బాగ్చీ బాధ్యతల స్వీకరణతో.. సుప్రీంకోర్టులో జడ్జీల సంఖ్య 33కి చేరుకోనుంది. సుప్రీంకోర్టులో గరిష్ఠంగా 34 మంది జడ్జీలు ఉండవచ్చు. 1966 అక్టోబర్ మూడున జన్మించిన బాగ్చీ సుప్రీంకోర్టులో ఆరేళ్ల పాటు జడ్జిగా కొనసాగనున్నారు. ఈ కాలంలోనే పదోన్నతి పొంది సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తిగానూ సేవలందించే అవకాశముంది. 2011 జూన్ 27న బాగ్చీ కోల్‌కత్తా హైకోర్టు జడ్జిగా నియమితులయ్యారు. తర్వాత 2021 జనవరి నాలుగోతేదీన ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు బదిలీఅయ్యారు. అదే ఏడాది నవంబర్ 8న తిరిగి కోల్‌కతా హైకోర్టుకు బదిలీ అయ్యారు. అప్పటి నుంచి అదే హైకోర్టులో సేవలందిస్తున్నారు. కోల్‌కతా హైకోర్టులో మొత్తంగా 13 ఏళ్ల పలు రకాల కేసులకు సంబంధించిన కీలక తీర్పులు వెలువర్చారు.

కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరుపై

ఇడి పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టులో నేడు విచారణ

న్యూఢిల్లీ : ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేయడాన్ని సవాలు చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు సోమవారం విచారించనుంది. ఈ పిటిషన్ జస్టిస్ రవీందర్ దుడేజా ధర్మాసనం ముందు విచారణకు రానుంది.

లిక్కర్ పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో గతేడాది జూన్ 20న కేజ్రీవాల్‌కు ట్రయల్ కోర్టు రూ. లక్ష వ్యక్తిగత పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఇడి పిటిషన్‌తో కేజ్రీవాల్ బెయిల్‌పై హైకోర్టు స్టే విధించింది. అనంతరం కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గతేడాది జులై 12న సుప్రీంకోర్టు కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది.

బెలూచిస్తాన్‌లో మళ్లీ రెచ్చిపోయిన ఉగ్రవాదులు

- ఐదుగురు భద్రతా సిబ్బంది మృతి

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లోని బెలూచిస్తాన్‌లో ఉగ్రవాదులు మరోసారి రెచ్చిపోయారు. సైనికులు ప్రయాణిస్తున్న మిలిటరీ కాన్వాయ్‌పై బాంబులతో దాడి చేశారు. ఆదివారం బెలూచిస్తాన్‌లోని నోష్కిలో ఈ దాడి ఘటన చోటు చేసుకొంది. ఈ దాడిలో ఐదుగురు సైనికులు ప్రాణాలు కోల్పోగా.. మరో 12 మందికి తీవ్ర గాయాలైనట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. అధికారులు జరిపిన ప్రాథమిక దర్యాప్తులో దీనిని ఆత్మాహుతి దాడిగా గుర్తించారు. ఈ విషయాన్ని నోష్కి స్టేషన్ హౌస్ ఆఫీసర్ వెల్లడించారు. అయితే మరోవైపు, ఈ పేలుడులో 90 మంది సైనికులను చంపినట్లు బలోచ్ లిబరేషన్ ఆర్మీ ఓ ప్రముఖ మీడియాకు మెయిల్ పంపింది. ఇటీవల బలోచిస్తాన్‌లో ఒక ప్రయాణికుల రైలును ఉగ్రవాదులు హైజాక్ చేసిన సంగతి తెలిసిందే. ఈ హైజాక్ జరిగిన అతి కొద్ది కాలంలో మరో దాడికి పాల్పడ్డారు.

నైట్ క్లబ్‌లో అగ్నిప్రమాదం

- 59 మంది మృతి

స్కోప్జే : యూరప్‌లోని నార్త్ మెసిడోనియాలో ఒక నైట్ క్లబ్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో 59 ప్రాణాలు కోల్పోయారు. మరో 100మందికిపైగా గాయపడినట్లు అధికారులు తెలిపారు. నార్త్ మెసిడోనియా రాజధాని స్కోప్జేకు సుమారు 100కి.మీ దూరంలో కొకాని అనే పట్టణంలోని పల్స్ క్లబ్‌లో శనివారం రాత్రి జరిగిన కాన్సర్ట్‌లో దాదాపు 1500 మంది పాల్గొన్నారు. అయితే, ఆదివారం తెల్లవారుజామున ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఈవెంట్‌లో మండే స్వభావం కలిగిన వస్తువుల వాడటంతోనే సీలింగ్‌కు నిప్పు అంటుకొందని ప్రాథమికంగా నిర్ధరించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది.

అమెరికాలో టోర్నడోల విజృంభణ

34 మంది మృతి

వాషింగ్టన్ : అమెరికాను పెను తుపాను, టోర్నడోలు వణికిస్తున్నాయి. బలమైన ఈదురు గాలులు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఈ ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఇప్పటి వరకు 34 మంది ప్రాణాలు కోల్పోగా పలువురు గాయపడ్డారు. బలమైన గాలుల కారణంగా ఇళ్ల పైకప్పులు కూలిపోవడంతో పాటు పెద్ద ట్రక్కులు సైతం బోల్తా పడ్డాయి. దుమ్ముధూళితో కూడిన గాలుల కారణంగా 50కి పైగా వాహనాలు ఢీకొన్నాయి. కాన్సాస్‌లో జరిగిన ఈ ప్రమాదంలో ఎనిమిది మంది మరణించినట్లు అధికారులు తెలిపారు. మిస్సోరీలోని బేకరర్స్ ఫీల్డ్ ప్రాంతంలో 12 మంది, మిసిసిపీలో ఆరుగురు మరణించగా.. ముగ్గురి ఆచూకీ గల్లంతైంది. టెక్సాస్‌లో వాహన ప్రమాదాల్లో నలుగురు మరణించారు. అదేవిధంగా.. ఆర్కాన్సాస్ రాష్ట్రంలో మరో ముగ్గురు చనిపోగా.. 29మంది గాయపడ్డారు. గవర్నర్ సారా హుకాబీ శాండర్స్ అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. పెద్ద ఎత్తున గాలులు వీయడంతో చెట్లు కూలి విద్యుత్ లైన్లు, భవనాలు దెబ్బతిన్నాయి. సెంట్రల్ యూఎస్‌లో దాదాపు 2 లక్షల ఇళ్లతో సహా వాణిజ్య సముదాయాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయినట్లు సమాచారం.

ఈ టోర్నడోలు మరిన్ని వచ్చే అవకాశం ఉందని, అందులో కొన్ని ప్రమాదకర స్థాయిలో ఉండవచ్చని జాతీయ వాతావరణ సేవల విభాగం హెచ్చరికలు జారీ చేసింది. టెక్సాస్, కాన్సాస్, దక్షిణ అమెరికా రాష్ట్రాల్లో దీని ముప్పు ఎక్కువగా ఉంటుందని తెలిపారు. మార్చిలో ఇలాంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులు అసాధారణమేమీ కాదని, అయితే.. ఈసారి వ్యాప్తి, తీవ్రత అధికంగా ఉందని జాతీయ వాతావరణ సేవల విభాగం అధికారులు తెలిపారు.

పాలస్తీనాకు మద్దతు తెలపడమే నేరమా?

- రంజని శ్రీనివాసన్ పై ట్రంప్ సర్కార్ నిర్బంధం
- కెనడాకు వెళ్లిపోయిన పిహెచ్‌డి విద్యార్థిని

వాషింగ్టన్ : పాలస్తీనాకు మద్దతు తెలపడమే నేరమా? అవుననే అంటున్నాడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. దీనిలో భాగమే అమెరికా యేతర పౌరురాలైన పిహెచ్‌డి స్కాలర్ రంజని శ్రీనివాసన్‌పై ట్రంప్ ప్రభుత్వం క్రూర నిర్బంధాన్ని ప్రయోగించింది. అర్బన్ ప్లానింగ్‌పై కొలంబియా యూనివర్సిటీలో టీచింగ్ అసిస్టెంట్‌గా వ్యవహరిస్తున్న అయిదో సంవత్సర పిహెచ్‌డి విద్యార్థి రంజని శ్రీనివాసన్ రూమ్‌కు ఫెడరల్ ఇమిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వెళ్లి తలుపు తట్టారు. లోపల నుంచి స్పందన లేకపోవడంతో తిరుగుముఖం పట్టారు. రెండవ రోజు అరెస్టు వారెంట్‌తో వెళ్లి తలుపు తట్టారు. అయినా, ఫలితం లేకపోయింది. మూడో రోజు మహ్మద్ ఖలీల్ అనే విద్యార్థిని అరెస్టు చేసి, రంజని శ్రీనివాసన్‌ను అరెస్టు చేయాలని చూశారు. అప్పటికే ఆమె తన మిత్రుల సహకారంతో తన రూమ్‌లో ఉన్న లగేజిని కొంత సర్దుకుని ఆ రూమ్ నుంచి మిత్రుల ఇంటికి వెళ్లిన ఆమె, అటు నుంచి గుట్టు చప్పుడు కాకుండా పొరుగునే ఉన్న కెనడాకు వెళ్లిపోయారు. అంతకు ముందు రంజని శ్రీనివాసన్ వీసాను ఉపసంహరించుకున్నట్టు హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ శాఖ(డిహెచ్‌ఎస్) ప్రకటించింది. ఈ పరిస్థితుల్లో ఇక్కడ ఉంటే చంపేసినా చంపేస్తారన్న భయంతో అమెరికా వీడ ఆమె కెనడాకు చేరుకున్నారు. ఇజ్రాయిల్ దాడులకు బలవుతున్న పాలస్తీనాకు సంఘీభావంగా యూనివర్సిటీలో ప్రదర్శన చేసినందుకు రంజని శ్రీనివాస్ వీసాను ఈ నెల 5న ట్రంప్ ప్రభుత్వం ఉపసంహరించామంది.

డిజిటల్ అరెస్ట్ కుంభకోణాల్లో...

భారత్‌కు రెండు వేల కోట్ల నష్టం

న్యూఢిల్లీ : గత మూడు సంవత్సరాల కాలంలో దేశంలో డిజిటల్ అరెస్ట్ కుంభకోణాల సంఖ్య పెరిగిపోయింది. మోసగాళ్లు బాధితులకు ఆడియో లేదా వీడియో కాల్స్ చేసి తాము సిబిఐ, ఇడి, ఐటి అధికారులమని చెప్పి భయపెడుతూ వారి నుండి సొమ్మును దోచుకుంటున్నారు. 2022లో ఇలాంటి డిజిటల్ అరెస్ట్ కుంభకోణం కేసులు 39,925 నమోదయ్యాయని జాతీయ సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సిఆర్‌పి) తెలిపింది. వాటి కారణంగా బాధితులు రూ.91 కోట్లు నష్టపోయారు. అయితే 2024 నాటికి కేసుల సంఖ్య గణనీయంగా పెరిగి 1,23,672కు చేరుకున్నాయి. అంటే 2022లో నమోదైన కేసులతో పోలిస్తే సుమారు మూడు రెట్లు అధికంగా కేసులు నమోదయ్యాయి. గత ఏడాది ఈ కేసుల కారణంగా బాధితులు రూ.1,935.5 కోట్లు...2022లో కంటే 20 రెట్లు అధికంగా...నష్టపోయారు. ప్రస్తుత సంవత్సరం మొదటి రెండు నెలల్లోనే 17,718 కేసులు నమోదయ్యాయి. బాధితులు రూ.210.2 కోట్లు నష్టపోయారు.

డిజిటల్ అరెస్ట్ సందర్భాల్లో బాధితులు సాధ్యమైనంత త్వరగా పోలీసులకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. ఫిర్యాదు అందగానే వారు ఆ బ్యాంక్ ఖాతాను ఫ్రీజ్ చేయిస్తారు. బదిలీ చేసిన సొమ్మును విత్‌డ్రా చేయకుండా బ్లాక్ చేస్తారు. ఆ తర్వాత ఆ ఖాతా ఎవరిది, ఫోన్ చేసిందెవరు అనే దానిపై ఆరా తీస్తారు. మోసగాళ్లు తమ డిజిటల్ ఫుట్‌ప్రింట్లను చెరిపేసేందుకు ప్రయత్నించినప్పటికీ పోలీసులు పలు కేసుల్లో వారిని గుర్తించి కటకటాల వెనక్కి నెట్టారు.

రాష్ట్రం నెత్తిన భస్మాసుర హస్తం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వానికి మోడీ సర్కార్ హుకుం జారీ చేసింది. దీనిపై రాష్ట్రంలోని టిడిపి నేతృత్వ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సివుంది. దేశ భద్రతకు అత్యంత ప్రధానమైన అణు జలాంతర్గామి, అణ్వాయుధ సంపత్తి గోదాములున్న వ్యూహాత్మక సైనిక స్థావరం ఈస్టర్న్ నేవల్ కమాండ్ సహా దేశ ప్రగతిలో కీలక భూమిక పోషిస్తున్న విశాఖ స్టీల్ ప్లాంట్, హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, నేవల్ డాక్ యార్డ్, విశాఖ పట్నం పోర్టు, గంగవరం పోర్టు, ఎన్‌టిపిసి థర్మల్ విద్యుత్ కేంద్రం అనకాపల్లిలోనే ఉన్నాయి. వీటికి అత్యంత సమీపంలో ఫార్మా కంపెనీలు, విశాఖపట్నం సెజ్, అచ్యుతాపురం సెజ్ ఉండటం, ఆ తర్వాత కాకినాడ పోర్టు ఇలా తీర ప్రాంతం మొత్తం దేశ భద్రత పరంగానూ, ప్రజల జీవనోపాదుల పరంగానూ అత్యంత సున్నితమైనది. దేశ రక్షణకు, ఆర్థిక సంపత్తికి కీలకమైన ఈ కేంద్రానికి చెరోవైపునా రెండు అణు కేంద్రాలను నిర్మించడానికి పూనుకోవడం ఎంత ప్రమాదకరమో వేరే చెప్పనవసరం లేదు. కాని ఈ అనాలోచిత, అవివేక చర్యలకు ప్రభుత్వం పాల్పడుతోంది.

గతంలో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర తీరం వెంబడి ప్రయివేటు థర్మల్ విద్యుత్ కేంద్రాలను స్థాపించడానికి పూనుకుంది. అప్పుడు అక్కడి ప్రజానీకం తిరగబడింది. వామపక్షాల అండదండలతో పోరాడి తిప్పికొట్టింది. ఇప్పుడు మళ్లీ ఎన్‌డిఎ ప్రభుత్వం అనకాపల్లిలో అణు కుంపటి రాజేస్తుండటం గమనార్హం. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని అయినా టిడిపి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ అణు కేంద్రాల ఏర్పాటు ప్రతిపాదనను తిరస్కరించాల్సివుండాల్సింది. వెనుకబడిన ఉత్తరాంధ్రను ఉద్ధరించేందుకే అణు కేంద్రాలను తీసుకొస్తున్నామంటూ వంచిస్తే అంతకంటే ద్రోహం ఉండదు.

మోడీ అమెరికా పర్యటన తర్వాత దూకుడు

ప్రధానమంత్రి నరేంద్ర మోడీని అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ పదేపదే తనకు అత్యంత సన్నిహితుడిగా చెప్పుకుంటారు. మోడీ సైతం తమ దోస్తీ ధృడమైనదని అంగీకరిస్తారు. ఈ బంధం ఇరు దేశాల ప్రజల మధ్య అయితే సంబరమే. కానీ వీరిది అటు ఆయనకు, ఇటు ఈయనకు సన్నిహితులైన బడా కార్పొరేట్లకు మేళ్లు చేకూర్చే బంధమే. ఈ క్రమంలోనే అమెరికా, దాని అనుంగు దేశాల్లోని కాలం చెల్లిన అణు సాంకేతికతను, అణు విద్యుత్ కేంద్రాల తుక్కు సామగ్రిని మన దేశంపై రుద్దడానికి తలుపులు తెరుచుకున్నాయి. అమెరికాలో ట్రంప్ తిరిగి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలోనే అప్పటి వరకు థర్మల్ విద్యుత్ కేంద్రాలకే పరిమితమైన కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టిపిసి) అణు విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణం కోసం ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసింది. అమెరికాలో మోడీ పర్యటన అనంతరం అణు ప్రాజెక్టుల నిర్మాణానికి చకాచకా చర్యలు చేపడుతూ ఎన్‌టిపిసి దూకుడు పెంచింది. వాస్తవానికి ప్రపంచ దేశాలన్నీ సౌర విద్యుత్, గాలి మరల విద్యుత్ వైపు పరుగులు పెడుతున్నాయి. రష్యాలో చెర్నోబిల్, 2011లో జపాన్‌లోని ఫుకుషిమా అణు ప్రమాదాల అనంతరం ప్రపంచ దేశాలన్నీ అణు విద్యుత్ కేంద్రాల ఆలోచనలకు కూడా సాహసించడం లేదు. మోడీ సర్కార్ మాత్రం నెత్తిన పెట్టుకుంటోంది. విదేశీ కార్పొరేట్ కంపెనీల లాభాల కోసం దేశం నెత్తిన అణు కుంపట్లను రగిలించేందుకు సిద్ధం కావడంపై మేధావులు, అణు శాస్త్రవేత్తలు, సామాజిక వేత్తలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

గుజరాత్‌ను ప్రతి విషయంలోనూ దేశానికే మోడల్ అని చెప్పే ప్రధాని మోడీ అణు విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు మాత్రం తన సొంత రాష్ట్రాన్ని కాదని ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తరాంధ్ర తీర ప్రాంతాన్ని ఎంచుకోవడం వెనుక మతలబు ఏమిటన్న ప్రశ్నకు పాలకమన్యులే సమాధానమివ్వాలి. అన్నింటా స్వేచ్ఛాయుత పోటీ ఉండాలని సన్నాయి నొక్కులు నొక్కుతూ సౌర, గాలి మరల విద్యుత్ రంగాలను, టెలికాం రంగాలను శాసిస్తున్న అదానీ, అంబానీ వంటి స్వదేశీ కార్పొరేట్‌లు అణు విద్యుత్ రంగం వైపు ఎందుకు మొగ్గు చూపడం లేదన్నదీ ఆలోచించాల్సిన అంశమే.

2020లో విశాఖలో ఎల్‌జి పాలిమర్స్ విష వాయువు లీకేజీ ఎంతటి విషాదాన్ని సృష్టించిందో ఇంకా కళ్ల ముందే కదలాడుతోంది. చిన్న ఫ్యాక్టరీలో విష వాయువు లీకేజీతోనే ఇంతటి నష్టం జరిగితే ఇక అణు విపత్తు ఎంతటి తీవ్రస్థాయిలో నష్టాన్ని కలిగిస్తుందో తల్చుకుంటేనే ఒళ్లు జలదరిస్తుంది. జపానులో నేటికీ ఫుకుషిమా బాధితుల ఆర్తనాదాలు మర్మోగుతూనేవున్నాయి.

తరతరాల పాటు వెంటాడే అణు ప్రమాద రుగ్మతలు పాలకులకు తెలియనివి కావు. పైడిభీమవరం నుండి నక్కపల్లి దాకా సుమారు 100 కిలోమీటర్ల మేర విస్తరించివున్న ఫార్మా పరిశ్రమలు ప్రమాదకర రసాయనాలనే వాడతాయి. అణు ప్రమాదమే గనుక జరిగితే ఈ పరిశ్రమలన్నీ విస్ఫోటక కేంద్రాలుగా మారి మహాప్రళయంగా పరిణమించే ప్రమాదం ఉంది. దేశ రక్షణ కోసం తూర్పు నౌకాదళం మోహరించిన అణు చోదిత జలాంతర్గామి కేంద్రానికి ఇరువైపులా అణు కేంద్రాలను ఏర్పాటు చేయడం ఎంత ప్రమాదమో పాలకులు పట్టించుకోకుండా స్వదేశీ, విదేశీ కార్పొరేట్ల సేవలో మునిగితరిస్తున్నారు.

ఎస్‌ఎల్‌బిసి టన్నెల్ సహాయక చర్యలు మరింత వేగవంతం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్‌ఎల్‌బిసి టన్నెల్ లోపల సహాయక చర్యలు వేగంగా కొనసాగుతున్నట్టు డి-1, డి-2 ప్రదేశాల్లో రెట్టింపు సహాయక బృందాలతో పనులు మరింత వేగవంతం చేసినట్లు నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం దోమల పెంటలోని ఎస్-ఎల్‌బిసి టన్నెల్ ఆఫీస్ వద్ద సహాయక బృందాల ఉన్నతాధికారులతో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..దక్షిణ మధ్య రైల్వే బృందం, ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ బృందం, హైడ్రా, ర్యాట్ మైనర్స్ తదితర బృంద సభ్యులతో భారీ స్థాయిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. సహాయక బృందాలకు అవసరమైన అన్ని సౌకర్యాలను, పనికి కావలసిన సామగ్రిని నిరంతరం అందిస్తున్నట్టు చెప్పారు.

అనకాపల్లి జిల్లాలో..

అణువిద్యుత్ ప్రాజెక్టును అనుమతించొద్దు

సిఎంకు రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇఎఎస్ శర్మ లేఖ

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి జిల్లాలో 2,800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన అణు విద్యుత్ ప్రాజెక్టును నిర్మించాలనే కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టిపిసి) ప్రతిపాదనను ఆమోదించవద్దని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును విశ్రాంత ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ కోరారు. ఈ మేరకు ఆయనకు లేఖ రాశారు. ఆ వివరాలను ఆదివారం వెల్లడించారు. 2011లో జరిగిన ఫుకుషిమా ప్రమాద అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఈ తరహా ప్రాజెక్టులను ప్రోత్సహించ వద్దని ఆ లేఖలో పేర్కొన్నారు. స్థానిక ప్రజలు నష్టపోయే న్యూక్లియర్ పవర్ ప్రాజెక్టుకు బదులు లక్షలాది మంది ప్రజలకు ప్రయోజనం కలిగే సోలార్ రూఫ్ టాప్ ప్యానెళ్లు, సోలార్ ఇరిగేషన్ పంపు సెట్లును అందుబాటులోకి తీసుకొచ్చి వారు ఉత్పత్తి చేసే మిగులు విద్యుత్‌ను గిట్టుబాటు ధరకు డిస్కామ్‌లకు అమ్మే పథకాన్ని ఆలస్యం చేయకుండా అమల్లోకి తేవాలని సూచించారు. 'అనకాపల్లి జిల్లాలో 2,800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన న్యూక్లియర్ పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి రెండు వేల ఎకరాల భూమిని కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎన్‌టిపిసి కోరినట్లు వార్తలొస్తున్నాయి. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ సంస్థ న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐఎల్) సుమారు పదేళ్ల క్రితం శ్రీకాకుళం జిల్లా కొవ్వాడలో ఆరు వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన న్యూక్లియర్ పవర్ ప్రాజెక్టు నిమిత్తం సస్యశ్యామలమైన సుమారు రెండు వేల ఎకరాల వ్యవసాయ భూమిని రాష్ట్ర ప్రభుత్వ సహాయంతో సేకరించింది. రెండు వేల కుటుంబాలను, ముఖ్యంగా సంప్రదాయ మత్స్యకారులను నిర్వాసితులుగా చేసి, వారి జీవితాలను బీభత్సం చేసే చర్యలకు దిగింది. దీన్ని స్థానిక ప్రజలు వ్యతిరేకించారు' అని లేఖలో ఇఎఎస్.శర్మ గుర్తుచేశారు. అనకాపల్లి జిల్లాలో న్యూక్లియర్ పవర్ ప్రాజెక్టు ఏర్పడితే విశాఖ, అనకాపల్లి జిల్లాల ప్రజలకు నీటి కొరత ఏర్పడుతుందని పేర్కొన్నారు. నిపుణుల అంచనాల ప్రకారం 2011లో ఫుకుషిమాలో ప్రమాదం జరిగిన రియాక్టర్ల పూర్తిస్థాయి శుద్ధికి ఇంకొక 30-40 ఏళ్లు పడుతుందని, దీనికి 180 బిలియన్ల డాలర్లు ఖర్చవుతుందని జపాన్ ప్రభుత్వం అంచనా వేసినట్టు తెలిపారు. కొవ్వాడ, అనకాపల్లి న్యూక్లియర్ పవర్ ప్రాజెక్టులలో ఎప్పుడైనా ఫుకుషిమా వంటి ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందని ప్రభుత్వం గుర్తెరగాలని పేర్కొన్నారు. ప్రాజెక్టు చుట్టూ 80 కిలోమీటర్ల వరకు ప్రమాద ప్రభావం ఉంటుందని ఫుకుషిమా అనుభవం చెబుతోందని తెలిపారు. న్యూక్లియర్ పవర్ ప్రాజెక్ట్ రియాక్టర్లను, అవసరమైన యురేనియం ఇంధనాన్ని విదేశాల నుంచి డాలర్ ధరలకు దిగుమతి చేసుకోవాల్సివున్నందున విద్యుత్ ఉత్పత్తి వ్యయం ఎక్కువగా ఉంటుందని వివరించారు. సామాన్యులకు విద్యుత్ ధరలు అందుబాటులో ఉండవని అభిప్రాయపడ్డారు. ఈ అనుభవాలను పరిగణనలోకి తీసుకొని ప్రమాదకరమైన న్యూక్లియర్ పవర్ ప్రాజెక్టు ప్రతిపాదనను తిరస్కరించి ప్రతి గ్రామంలో ఒక మెగావాట్‌కు కావాల్సిన రూఫ్ టాప్ సోలార్ ప్యానెళ్లను, అలాగే సోలార్ ఇరిగేషన్ పంపు సెట్లను ప్రజలకు అందచేసే చర్యలు చేపట్టాలని కోరారు. అవసరాలకు పోనూ మిగులు విద్యుత్‌ను డిస్కాంలకు అమ్మడం ద్వారా ప్రజలకు అదనపు ఆదాయం వచ్చే పథకాలను అమలుచేయాలని విజ్ఞప్తి చేశారు.



మీకోసం

కుక్కర్‌లో అన్నం, పప్పు వండేటప్పుడు అందులో పొడవాటి చెంచా వేస్తే ఎసరు బయటికి రాకుండా ఉంటుంది.

జీవన సౌరభం

ఇంగిత జ్ఞానం లేని మెదడులో ప్రశ్న ఉదయించదు. మౌఢ్యం నిండిన మనసుల్లో ఆలోచన పుట్టదు.

కొబ్బరి చెట్టు



నాంచారి పల్లి చెరువు దగ్గర రెండు కొబ్బరి చెట్లు ఉండేవి. ఒకటి చెరువుకు దూరంగా ఉన్నది. నీరందక వంకర టింకరగా పెరిగింది. ఇంకొక చెట్టు చెరువు కట్ట పైన ఉన్నది. చెరువులో నీరందడం వల్ల చక్కగా పెరిగింది. గుత్తులు గుత్తులుగా కొబ్బరి కాయలు కాసేది. ఊరిలోని వారందరూ ఈ చెట్టు దగ్గరకు వచ్చి కాయలు తెంపుకు పోయేవారు. దీంతో దానికి గర్వం పెరిగింది.

ఒకసారి వంకర కొబ్బరి చెట్టుతో 'చూశావా! వంకరి దానా! నావద్దకే ఊరందరూ వచ్చి కొబ్బరి కాయలు తీసుకొనిపోతున్నారు. నీ వంకర ముఖాన్ని చూడడానికి ఏ ఒక్కరూ ఇష్టపడడం లేదు' అంది. అప్పుడు వంకర చెట్టు ఏమీ మాట్లాడలేదు. మౌనంగా ఉండిపోయింది.

కొన్ని రోజులకు చెరువు కట్టను వెడల్పు చేయడానికి ఇంజనీర్లు వచ్చారు. కట్ట దగ్గరలో ఉన్న కొబ్బరిచెట్టుని తొలగించాలని అనుకున్నారు. జెసిబి తెచ్చి దాని కొమ్మలు, కాయలు తొలగిస్తున్నారు. అప్పుడు కొబ్బరి చెట్టు ఏడుస్తూ కూర్చొంది. అప్పుడు దూరాన ఉన్న వంకర కొబ్బరి చెట్టు దాన్ని ఎలాగైనా కాపాడాలనుకుంది. ఉన్నట్లుండి దాని కొమ్మలు అటూఇటూ బలంగా ఊపింది. కిందనున్న మట్టిని విసురుగా పైకి లేపింది. అప్పుడు పొగరుబోతు చెట్టును కొడుతున్న వారిలో ఒకతను అది చూశాడు. మనసులో ఏదో ఆలోచించుకుని అధికారి దగ్గరికి వెళ్లాడు. 'బాబూ ఇప్పుడు కొడుతున్న ఈ కొబ్బరిచెట్టు మాకు చాలా కాలంగా కాయలు, మట్టలు ఇస్తోంది. ఎంతో ఉపయోగపడింది. దీన్ని ఇక్కడి నుంచి తీసేసినా మళ్లీ చిగురించే ప్రయత్నం చేయండి బాబు' అని బతిమాలాడాడు.

అధికారులు అందుకు అంగీకరించారు. ఆ కొబ్బరి చెట్టును వేర్లతో సహా పెకిలించారు. దాన్ని వంకర చెట్టుకు దగ్గరలో పాతి పెట్టారు. అది నాటుకునే వరకు నీరు పోశారు. చిగురులు తొడుగుతున్న తన నేస్తాన్ని చూసి వంకర కొబ్బరి చెట్టు ఎంతో సంతోషించింది. అప్పుడు పొగరుబోతు చెట్టు వంకర చెట్టుతో 'మిత్రమా! నన్ను క్షమించు. నా కళ్ళు తెరిపించావు. ఎవరినీ ఎగతాళి చేయొద్దని తెలుసుకున్నాను. ఇక నుండి మనము స్నేహితులుగా ఉందాం' అని చెప్పింది. ఆ రోజు నుండి రెండు కొబ్బరిచెట్లు కలిసిమెలిసి పెరిగాయి.



– పెంబర్ల చరణ్,
6వ, తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
బక్రిచెప్యాల,
సిద్ధిపేట జిల్లా.

నేను గీసిన బొమ్మ



తాళ్లూరి శ్రావణి,
3వ తరగతి,
మండల పరిషత్ ప్రైమరీ స్కూలు,
చిల్లకల్లు మెయిన్,
జగ్గయ్యపేట మండలం,
ఎన్టీఆర్ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

గ్యాంగ్ ఉమెన్

తిరుపతికి వెళ్లే దారిలో రేణిగుంట రైల్వేస్టేషనుకు సమీపాన రైల్వే గ్యాంగ్ కార్మికులుగా ఈ ముగ్గురు మహిళలు పనిచేస్తున్నారు. వీరు ప్రతిరోజూ కాలి నడకన, ట్రాక్ వెంబడి 10 కిలోమీటర్లు దూరం ప్రయాణిస్తూ ట్రాక్ మరమ్మతులు చేస్తున్నారు. గ్రీజు పూయడం, డెబ్రీలను శుభ్రపర్చడం, ట్రాక్ పనితీరుని సరిచూడడం, పాములు, తేళ్లు, ఇతర విషసర్పాలు ఏవైనా ట్రాక్‌లో చిక్కుకుని ఉంటే వాటిని వెళ్లగొట్టడం వీరి దినచర్య. దొంగల భయంతో పురుషులు కూడా ఒంటరిగా ప్రయాణించలేని ప్రమాదకర పరిస్థితుల్లో ఈ మహిళలు ఏళ్ల తరబడి పనిచేస్తున్నారు.



యాభై ఏడేళ్ల జి చంద్రమ్మ 1993 నుండి రైల్వే ట్రాక్ మెయింటైనర్ బాధ్యతల్లో ఉన్నారు. తన ఉద్యోగ ధర్మం గురించి ఆమె ఇలా చెబుతున్నారు. 'నేను ఉద్యోగంలో చేరేనాటికి నా భర్త చనిపోయాడు. ఏ విద్యార్హత లేని నన్ను తాత్కాలిక ఉద్యోగిగా మాత్రమే తీసుకున్నారు. విధి నిర్వహణలో ఎన్నో ఇబ్బందులు పడ్డాను. అయినా వెనుదిరిగి చూడలేదు. వృత్తిపరంగా మొదట్లో నాకు ఏ నైపుణ్యాలు లేవు. కానీ అనుభవమే అన్నీ నేర్పింది. 30 ఏళ్లుగా పురుషుల మధ్య పనిచేస్తున్నాను. చాలా ఏళ్లపాటు ఈ ఉద్యోగంలోకి మహిళలు రాలేదు' అని కాస్తంత విచారవదనంతో ఆమె చెబుతోంది. విధి నిర్వహణలో చంద్రమ్మ చూపిన అంకితభావానికి గాను ఐదేళ్ల క్రితం ఉత్తమ విధులు నిర్వర్తించిన గ్యాంగ్‌గా చంద్రమ్మకి గుంతకల్ డిఆర్‌ఎం అవార్డు ప్రకటించింది.

ఆర్ నందిని 2016 నుండి ఇక్కడ ట్రాక్ మెయింటైనర్‌గా పనిచేస్తోంది. 'నాన్న రిటైర్డ్ అయిన తరువాత నాకు ఈ ఉద్యోగం వచ్చింది. బిఎ పూర్తిచేసిన నేను టీచర్‌గా పనిచేయాలనుకున్నాను. కానీ కుటుంబ బాధ్యతలు నన్ను ఈ పనిలోకి వెళ్లేలా చేశాయి. తల్లిదండ్రులను, చెల్లి, తమ్ముడి బాధ్యతలు చూసుకోవాల్సిన బాధ్యత నాపై ఉంది. ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాను. మొన్నీమధ్యే చెల్లి పెళ్లి చేశాను. తమ్ముడి పెళ్లి త్వరలో చేయాలి' అంటున్న నందిని అవివాహిత. ఉదయం 7 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు విధుల్లో ఉంటుంది. 'మేము పురుషులతో సమానంగా పనిచేస్తున్నాం. అధికారులు అప్పచెప్పిన పనిని సకాలంలో, సమర్థవంతంగా పూర్తిచేయడం మా కర్తవ్యం. ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా బెదరకుండా మా పని మేం చేస్తాం' అంటూ తన విధినిర్వహణలను నందిని వివరించారు.



జ్యోతి కుమారి రామ్ పశ్చిమబెంగాల్ నుండి వచ్చారు. 2023 నుండి ఇక్కడి ట్రాక్ మెయింటైనర్‌గా పనిచేస్తున్నారు. 'నేను పశ్చిమబెంగాల్ కంచర్ పడా గ్రామం నుండి వచ్చాను. ఆరు నెలలకు ఒకసారి ఇంటికి వెళతాను. ఇది చాలా కష్టంగా ఉంటుంది. ఆర్మీలో చేరాలని కలలుకన్నాను. కానీ కుటుంబ పరిస్థితులు ఇక్కడికి వచ్చేలా చేశాయి. ఇష్టం లేని పనే అయినా అప్పగించిన బాధ్యతలు ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదు. ఉద్యోగం చేస్తూనే ప్రైవేటుగా చదువుకుంటున్నాను. ఎందుకంటే నా వృత్తి, ప్రవృత్తి రెండూ నాకు ముఖ్యమే' అంటోంది.

చంద్రమ్మ, నందిని, జ్యోతి లాంటి మహిళలు మనచుట్టూ ఎంతోమంది. ప్రమాదకర పరిస్థితులను సైతం లెక్కచేయకుండా అంకితభావంతో పనిచేస్తున్న ఆ మహిళలందరిని మనసారా అభినందిద్దాం.

ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్‌లో ఇండియా సత్తా

రాయ్‌పూర్: ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్ టైటిల్‌ను ఇండియా మాస్టర్స్ జట్టు సొంతం చేసుకుంది. వెస్టిండీస్ మాస్టర్స్ టీమ్‌తో రాయ్‌పూర్ వేదికగా ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 148 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ 4 వికెట్లు కోల్పోయి.. 17.1 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. ఓపెనర్ అంబటి రాయుడు(74; 50 బంతుల్లో 9×4,3×6) అర్ధ శతకంతో చెలరేగాడు. సచిన్ టెండూల్కర్ (25,18 బంతుల్లో 2×4, 1×6), గుర్ కీరత్ సింగ్ (14) ఫర్వాలేదనిపించారు. చివర్లో వచ్చిన యువరాజ్ (13*), స్టువర్ట్ బిన్నీ (16) నాటౌట్‌గా నిలిచారు. విండీస్ బౌలర్లలో అష్లే నర్స్ 2 వికెట్లు పడగొట్టగా.. టినో బెస్ట్, బెన్ చెరో వికెట్ తీశారు.

తొలుత బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ దూకుడుగా ఇన్నింగ్స్ ప్రారంభించింది. ఓపెనర్ స్మిత్ (45, 35 బంతుల్లో 6×4, 2×6) అద్భుత ప్రారంభాన్నిచ్చాడు. అయితే, కెప్టెన్ బ్రియాన్ లారా (6), ఫస్ట్ డౌన్‌లో వచ్చిన పెర్కిన్స్ (6) నిరాశ పరిచారు. నదీమ్ బౌలింగ్‌లో పెర్కిన్స్ ఎల్బీడబ్ల్యూగా వెనుదిరగగా.. అక్కడికి స్వల్ప వ్యవధిలోనే వినయ్‌కుమార్ బౌలింగ్‌లో నేగికి క్యాచ్ ఇచ్చి లారా పెవిలియన్‌కు చేరాడు. రెండో డౌన్‌లో వచ్చిన సిమన్స్ (57, 41 బంతుల్లో 5×4, 1×6)తో కలిసి స్మిత్ ఇన్నింగ్స్ నిర్మించే ప్రయత్నం చేశాడు. క్రీజులో నిలదొక్కుకుంటున్న ఈ జోడీని నదీమ్ విడగొట్టాడు. జట్టు స్కోరు 67 పరుగుల వద్ద స్మిత్ బౌల్డయ్యాడు. ఓ వైపు వికెట్లు పడిపోతున్నా.. సిమన్స్ అర్ధశతకం సాధించి.. జట్టుకు మంచి స్కోరే అందించాడు. భారత్ మాస్టర్స్ బౌలర్లలో వినయ్ కుమార్ 3 వికెట్లు పడగొట్టగా..నదీమ్ 2, నేగి, బిన్నీ చెరో వికెట్ తీశారు.



ప్రత్యేక గీతాల్లో మహిళా స్వరం

"ఎక్కడ స్త్రీలు పూజించబడతారో అక్కడ దేవతలు నడయాడుతారు" వంటి గొప్ప మాటలు మనకు వినిపిస్తాయి కానీ, మన సమాజంలో వాటి ఆచరణ ఆ స్థాయిలో కనిపించదు. ఆధునిక మహిళ విద్య ద్వారా తనను తాను తెలుసుకొని, తనను తాను మనిషిగా మలచుకోవడం మొదలుపెట్టింది. కందుకూరి, గురజాడ, చలం వంటి వారు తమ జీవితాంతం మహిళాభ్యున్నతి కోసం పాటుపడ్డారు. ఈ క్రమంలో సమాజాన్ని ఎక్కువగా ప్రభావితం చేసే సినిమాల్లో కూడా కొంతవరకూ స్త్రీవాద చైతన్యం కనిపిస్తుంది. ఈ క్రమంలో మగవాళ్లను ఆకట్టుకోవడానికి రూపొందించే ప్రత్యేక గీతాల్లో అక్కడక్కడా మహిళా దృక్పథ స్వరం వినపడడం అభినందనీయం.

సుకుమార్ మొదటి సినిమా ఆర్య. అప్పట్లో విఫల ప్రేమికుల ఆత్మహత్యలు ఎక్కువగా కనిపించేవి. "ఓ మై బ్రదరూ చెబుతా వినరో వన్ సైడ్ లవ్వేరా ఎంతో బెటర్" అంటూ యువతకు ఒక కొత్త పాఠం చెప్పారు ఈ లెక్కల మాస్టారు ఆర్య సినిమాలో ఈ పాట ద్వారా. లవ్ ఫెయిల్యూర్‌తో గుండెలు బురువెక్కి జీవితాన్ని కోల్పోనక్కర్లేదు. ఇచ్చే స్థానంలో మనం ఉన్నాం అనే ఒక తేలికతనాన్ని సమాజంలో తీసుకువచ్చింది ఈ సినిమా. తరువాతి సినిమాల్లో సుకుమార్ సామాజిక రుగ్మతలను ఎత్తి చూపడానికి వాహికగా ప్రత్యేక గీతాలను వాడుకున్నాడు. చిత్రీకరణ కొంత అభ్యంతరకరంగా ఉన్నా... తన ప్రత్యేక గీతాల్లో పురుషాధిపత్యాన్ని, కపటత్వాన్ని, నీచత్వాన్ని ఎండగట్టడం కనిపిస్తుంది. 100% లవ్, రంగస్థలం, పుష్ప సినిమాల్లోని ఆ పాటల్లో ఉన్న పాదాలను గమనిస్తే లోకపు పోకడలను, మగవాడి ఆలోచనలను ఎంతగా విప్పి చూపించారో మనకు అవగతం అవుతుంది.



భర్తల అనుమానపు బాధితులైన స్త్రీల ఆవేదనే 100% లవ్ సినిమాలో ప్రత్యేక గీతం. మంగతాయారు వ్యథలో ఆడవాళ్ళను అమ్మడాన్ని, ముఖ్యంగా అక్రమ రవాణాను స్పృశిస్తుంది. "గజ్జల సప్పుడు విన్నాడా ఎక్కడికెళ్లావంటాడు/ గాజుల ఊపుడు విన్నాడా ఎవడికి సైగలు అంటాడు/ పక్కింటోడికి పొలమారిందా నువ్వే తలిసావంటాడు/ పొరిగింటోడికి జొరమొచ్చిందా నీపై దిగులని అంటాడు" .. ఇలా అనుమానపు భర్తల ఆలోచనల తీరు ఈ పాట ఎండగడుతుంది. "దుడ్డు కావాలన్నాడో దుబాయ్ నన్ను పంపాడు/ ఫ్రిడ్జి టీవీ కొంటానే పైసలు పంపిమన్నాడు/ సోఫా సెట్టు కొంటానే సొమ్ములు పంపిమన్నాడు / ఇవన్నీ పెట్టాలంటే ఇల్లు కావాలన్నాడు" అంటూ వివరిస్తుంది. దేశం కానీ దేశానికి పని మనుషులుగా వెళ్లి పదో పరకో సంపాదించి భర్తలకు పంపిస్తుంటే, వాటితో ఇక్కడ జల్సాలతో కులికే మగాళ్ళను అందమైన పాట రూపంలో ఆరు బయట పెట్టించారు దర్శక, రచయితలు. రంగస్థలం 'జిగేలు రాణి' పాటలో ఒకనాటి మునసబు, కరణము, పోలీసు మొదలగు పెత్తందారీ వ్యవస్థ తీరును బట్టబయలు చేస్తుంది. "మీ అయ్య తోటి నీకు పోటీ వద్దంటాను" అనే మాటతో ముందున్న సమాజంలో, ప్రతి పురుషుడు, స్త్రీని భోగ వస్తువుగానే చూసాడు అనే అంతర్యాన్ని పాటలో వినిపించారు. పుష్ప-1 లో స్త్రీల పట్ల మగవాళ్ళ మనస్తత్వాన్ని మరుగు లేకుండా ఎరుకపరిచారు. "కోక కోక కోక కడితే కొరకొర చూస్తారు/ పొట్టి పొట్టి గౌను వేస్తే పట్టి పట్టి చూస్తారు/ కోకా కాదు గౌను కాదు కట్టులోన ఏముంది/ మీ కళ్ళలోనే అంతా ఉంది మీ మగబుద్దే వంకర బుద్ధి" అంటోంది ఈ పాట. ఎక్కడైనా ఏదైనా స్త్రీకి అఘాయిత్యం జరిగితే దానికి కారకులను నిందించకుండా, స్త్రీల వస్త్రధారణను విమర్శిస్తారు చాలామంది. స్త్రీల బట్ట, కట్టులో కాదు మీరు చూసే చూపులోనే తేడా ఉంది తెలుసుకోమంటోంది ఈ పాట. పుష్ప-2 లో కిసిక్ పాట స్త్రీల విషయంలో ఆధునిక సమాజంలో ఫోటో మార్ఫింగులతో చిన్న బుచ్చడాన్ని చెబుతూనే, అది మానుకోపోతే దెబ్బలు పడతాయిరో అంటూ ఒక హెచ్చరికను కూడా చేస్తుంది.


సినిమా ఎక్కువమందికి చేరే మాధ్యమం. సినిమా పాట ఎక్కువ కాలం ఎక్కువ ఇళ్లల్లో మారుమోగే సాధనం. అందువలన సినిమా మరియు సినిమా పాట ఎక్కువమందిని ప్రభావితం చేస్తుంది. అలాంటి సినిమాలో ఒక పాటను సమాజపు గతుకులను, లోభాలను, లోపాలను ఎత్తి చూపించడానికి వాహికగా వాడుకోవటం మంచిదే! అయితే పాటను దృశ్యంగా చూపటంలో కాస్త శృతిమించకుండా చూడాలి. ఈ ప్రత్యేక గీతాల్లోని భావాలను డామినేట్ చేసేలా, చిత్రీకరణ ఉంటే ప్రేక్షకులకు చేర్చాలనుకున్న సందేశం చేరదు. ఆ విషయంలో దర్శకులు తగిన మెలకువలు పాటించటం అవసరం అనిపిస్తోంది.

– డా. ఆల్తి మోహన రావు
99638 95636

ప్రముఖ ఒడియా కవి రమాకాంత రథ్ మృతి

భువనేశ్వర్ : ప్రముఖ ఒడియా కవి, పద్మభూషణ్ అవార్డు గ్రహీత రమాకాంత రథ్ (90) ఆదివారం తుదిశ్వాస విడిచారు. భువనేశ్వర్‌లోని ఖర్వెల్ నగర్ ప్రాంతంలోని నివాసంలో రమాకాంత కన్నుమూసినట్లు ఆయన కుటుంబసభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రమాకాంత రథ్‌కు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. రమాకాంత రథ్ మరణంపై ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ అధికారిగా ఆయన అందించిన సేవ, సాహిత్య ప్రపంచానికి చేసిన కృషి ఎప్పటికి గుర్తుండిపోతాయని అన్నారు. రథ్ కుటుంబానికి సానుభూతి ప్రకటించారు. ప్రభుత్వ లాంఛనాలతో రథ్ అంత్యక్రియలు నిర్వహిస్తామని అన్నారు.

1977లో సాహిత్య అకాడమీ అవార్డు, 1984లో సరళా అవార్డు, 1990 బిషువ సమ్మాన్, 2009లో సాహిత్య అకాడమీ ఫెలోషిప్‌లతో సత్కరించారు. సాహిత్యానికి ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా భారత ప్రభుత్వం 2006లో పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది. 1993 నుంచి 1998 వరకు కేంద్ర సాహిత్య అకాడమీ ఉపాధ్యక్షుడిగా, 1998 నుండి 2003 వరకు అధ్యక్షుడిగా పనిచేశారు.



తొలి రేసు నోరిస్‌దే!

- మెక్‌లారెన్ రేసర్ నోరిస్‌కు టైటిల్
- రెండో స్థానంతో వెర్‌స్టాపెన్ సరి
- ఆస్ట్రేలియన్ గ్రాండ్ ప్రీ ఫార్ములా వన్



మెల్‌బోర్న్ (ఆస్ట్రేలియా) : ఫార్ములా వన్ సీజన్ తొలి రేసు నాటకీయ పరిణామాల నడుమ ఆద్యంతం ఉత్కంఠ రేపుతూ సాగింది. తొలి రెండు రోజులు విపరీత ఉష్ణోగ్రతలు డ్రైవర్లకు సవాల్ విసరగా.. ప్రధాన రేసుకు వరుణుడు రంగ ప్రవేశం చేశాడు. ఎడతెగని వర్షం, తడిసిన ట్రాక్‌పై పట్టు కోసం డ్రైవర్లు నానా తంటాలు పడ్డారు. ప్రమాదకర మలుపుల వద్ద నియంత్రణ కోల్పోయి డ్రైవర్లు ట్రాక్ తప్పారు. ఇన్ని అవాంతరాలను సమర్థవంతంగా దాటుకుంటూ మెక్‌లారెన్ డ్రైవర్ లాండో నోరిస్ (గ్రేట్ బ్రిటన్) టైటిల్‌ను ఎగరేసుకుపోయాడు. నాలుగు సార్లు వరల్డ్ ఛాంపియన్, రెడ్‌బుల్ డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ (బెల్జియం) రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. 58 ల్యాప్‌ల ఆస్ట్రేలియన్ గ్రాండ్ ప్రీ రేసును గంటా 42 నిమిషాల 06.304 సెకండ్లలో లాండో నోరిస్ రేసును ముగించాడు. నోరిస్ కంటే 0.895 సెకండ్ల తర్వాత రేసును పూర్తి చేసిన వెర్‌స్టాపెన్‌కు నిరాశ తప్పలేదు. మెక్‌లారెన్ మరో డ్రైవర్, లోకల్ స్టార్ ఆస్కార్ పియాస్ట్రి తొమ్మిదో స్థానంతో రేసును ముగించాడు. తొలిసారి దిగ్గజ రేసింగ్ జట్టు ఫెరారీ తరపున బరిలో నిలిచిన లూయిస్ హామిల్టన్ పదో స్థానంలో నిలిచాడు. అగ్రస్థానంలో నిలిచిన లాండో నోరిస్ 25 పాయింట్లను ఖాతాలో వేసుకుని డ్రైవర్ ఛాంపియన్‌షిప్‌లో సైతం టాప్ ప్లేస్ సొంతం చేసుకున్నాడు. వెర్‌స్టాపెన్‌కు 18 పాయింట్లు, రస్సెల్ (మెర్సిడెస్) 15 పాయింట్లు దక్కాయి. ట్రాక్‌పై అవాంతరాలతో పలుమార్లు సేఫ్టీ కారు ట్రాక్‌పై చక్కర్లు కొట్టింది.



లాండో నోరిస్

ఆరేళ్లుగా భర్తీకాని లోక్‌సభ డిప్యూటీ స్పీకర్

- కేంద్రం ఇంకా ఎందుకు భర్తీ చేయలేదు?
- ప్రతిపక్షాలు, రాజ్యాంగ నిపుణుల ప్రశ్న
- రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతోందని విమర్శ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

గత ఆరేళ్లుగా లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ పదవిని భర్తీ చేయకుండా ఉండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ పదవిని కేంద్ర ప్రభుత్వం ఇంకా ఎందుకు భర్తీ చేయలేదని ప్రతిపక్షాలు, రాజ్యాంగ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. పార్లమెంటరీ వ్యవస్థలో డిప్యూటీ స్పీకర్‌కు ముఖ్యమైన పాత్ర ఉందని, రాజ్యాంగం కల్పించే ఈ పదవిని నియమించకుండా కేంద్ర ప్రభుత్వం ఉల్లంఘిస్తుందని విమర్శిస్తున్నారు. 17వ లోక్‌సభలో కేంద్రం ప్రభుత్వం డిప్యూటీ స్పీకర్‌ను నియమించలేదు. జూన్‌తో ఏడాది పూర్తి చేసుకోనున్న 18వ లోక్‌సభలో కూడా ఆ ఖాళీని భర్తీ చేయాలనే ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేదని ప్రతిపక్ష సభ్యులు విమర్శిస్తున్నారు.

స్పీకర్‌తో జరిగిన సమావేశాల్లో ప్రతిపక్ష సభ్యులు డిప్యూటీ స్పీకర్ అంశాన్ని లేవనెత్తినప్పటికీ, ఆ పదవిని భర్తీ చేయడంలో ఎటువంటి పురోగతి లేదని కాంగ్రెస్ సీనియర్ ఎంపి ఒకరు అన్నారు. "డిప్యూటీ స్పీకర్ పదవి భర్తీ చేయడంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ చెబుతున్నారు. ప్రభుత్వం ఆ పదవిని ప్రతిపక్షానికి ఇవ్వడానికి ఇష్ట పడటం లేదు. పార్లమెంటరీ నిబంధనల ప్రకారం ఆ పదవి ప్రతిపక్ష పార్టీలకు వెళుతుంది" అని ఆయన అన్నారు.

18వ లోక్‌సభ తొలి సమావేశంలోనే లోక్‌సభ స్పీకర్ ఎన్నిక విషయంలో ఎన్‌డిఎ, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. స్వతంత్ర భారతదేశ చరిత్రలో నాలుగోసారి, దాదాపు 50 ఏళ్లలో మొదటిసారిగా స్పీకర్ పదవికి పోటీ జరిగిన విషయం తెలిసిందే. డిప్యూటీ స్పీకర్ పదవి విషయంలో ప్రతిపక్షం, ప్రభుత్వం ఏకాభిప్రాయానికి రావడంలో విఫలమవ్వడంతోనే స్పీకర్ పదవికి పోటీ అనివార్యమైంది. స్పీకర్లను ఎక్కువగా ఏకాభిప్రాయంతోనే ఎంపిక చేసినప్పటికీ, మోడీ ప్రభుత్వం డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్షానికి ఇవ్వడానికి నిరాకరించడంతో తమ అభ్యర్థిని నిలబెట్టాల్సి వచ్చిందని ప్రతిపక్షాలు స్పష్టం చేశాయి.

రాజ్యాంగ నిపుణుడు పిడిటి ఆచారి మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్ ఎన్నిక రాజ్యాంగంలో తప్పనిసరి నిబంధన అని అన్నారు. "అలా చేయకపోతే, అది ఆర్టికల్ 93ను ఉల్లంఘించడమే అవుతుంది. డిప్యూటీ స్పీకర్ ప్రైవేట్ సభ్యుల బిల్లు, పార్లమెంటు హౌస్ బడ్జెట్ కమిటీ వంటి కమిటీలకు అధ్యక్షత వహిస్తారు" అని ఆయన అన్నారు. రూల్ 8 ప్రకారం డిప్యూటీ స్పీకర్ పదవికి ఎన్నిక "స్పీకర్ నిర్ణయించే తేదీన జరగాలి" అని పేర్కొన్నారు. డిప్యూటీ స్పీకర్ పేరును ప్రతిపాదిస్తూ ఒక తీర్మానం ప్రవేశపెట్టిన తరువాత ఆయన ఎన్నికవుతారు. లోక్‌సభలోని విధాన నిబంధనలు, కార్యకలాపాల ప్రవర్తన నియమాల ప్రకారం డిప్యూటీ స్పీకర్ సభకు అధ్యక్షత వహించినప్పుడు స్పీకర్‌తో సమానమైన అధికారాలను పొందుతారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 180 ప్రకారం డిప్యూటీ స్పీకర్ తన కుర్చీ ఖాళీగా ఉన్నప్పుడు స్పీకర్ విధులను నిర్వహించే అధికారం కలిగి ఉంటారు.

ప్రస్తుతం, స్పీకర్ లేనప్పుడు సభ సమావేశాలకు చైర్‌పర్సన్‌ల ప్యానెల్ అధ్యక్షత వహిస్తుంది. 10 మంది ఎంపిల ప్యానెల్‌ను గత జూలైలో స్పీకర్ నియమించారు. అయితే, 16వ లోక్‌సభలో ప్రధాని మోడీ మొదటి పదవీకాలంలో ఆ పదవిని అన్నాడిఎంకెకి చెందిన ఎం. తంబిదురై నిర్వహించారు. యుపిఎ-1 హయాంలో అప్పటి బిజెపి మిత్రపక్షమైన అకాలీదళ్ నాయకుడు చరణ్‌జిత్ సింగ్ అత్వాల్ డిప్యూటీ స్పీకర్ పదవిని నిర్వహించారు. యుపిఎ-2 హయాంలో బిజెపికి చెందిన కరియా ముండా డిప్యూటీ స్పీకర్ పదవిని నిర్వహించారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68